
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
ఆదివారం 10 మార్చి 2024



వైసీపీలో ఓటమి భయం..

- వలంటీర్లూ.. పాహిమాం.. పాహిమాం..
- సర్వం వలంటీర్లపైనే భారం..
- భరోసా ఇవ్వని నవరత్నాలు
- మచ్చుకు కానరాని అభివృద్ధి
- హద్దు మీరిన వైసీపీ నేతల ఆగడాలు.. దాడులు..
- ఓట్ల తొలగింపు.. కానుకల పంపిణీ.. ఇంటింటి ప్రచారం..
- పడిపోతున్న వైసీపీ గ్రాఫ్.. టీడీపీకి పెరుగుతున్న ఆదరణ





వైసీపీ నాయకులు పంపిణీ చేసిన పట్టుచీర

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): సాధారణ ఎన్నికకు మరో 40 రోజుల్లోపే ఉన్న సమయంలో అధికార పార్టీని ఓటమి భయం వెంటాడుతోంది. సంక్షేమానికి తాము పెద్దపీట వేశామని ఎంతో గొప్పగా ప్రచారం చేసుకున్న నవరత్నాలు గెలుపుపై ఏమాత్రం భరోసా ఇవ్వడం లేదు. గత ఐదేళ్లలో జిల్లాలో కనీసం ఒకటంటే ఒకటి కూడా పరిశ్రమ రాలేదు. దీంతో జిల్లాకు చెందిన వేలాది మంది ఉన్నత చదువులు చదివిన నిరుద్యోగులు బెంగళూరు, చెన్నై, హైదరాబాదు వంటి ప్రాంతాలకు ఉపాధి కోసం వెళుతున్నారు. ఇసుక దొరక్క పనులు లేక.. జిల్లాకు చెందిన వేలాది మంది కూలీలు బయట ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో మచ్చుకైనా అభివృద్ధి కానరాలేదు. రోడ్లు వేయలేదు. గుంతల రోడ్ల మీద.. జనాలు ప్రాణాలు అరచేత పట్టుకుని ప్రయాణాలు చేస్తున్నారు. ఇదే సమయంలో అధికార పార్టీకి చెందిన చోటా, మోటా నాయకుల నుంచి పెద్ద నాయకుల వరకు అడ్డూ అదుపు లేకుండా చెలరేగిపోయారు. మేం ఏం చేసినా చెల్లుతుంది.. ఏం చెప్పినా ప్రజలు నమ్మేస్తారు.. అధికారం శాశ్వతం అనుకున్నారు. అధికారం చేతిలో ఉందని.. ఇష్టం వచ్చినట్లు చెలరేగిపోయారు. ఇసుకను అమ్ముకున్నారు. ప్రభుత్వ భూములు కాజేశారు. పలు ప్రైవేటు ఆస్తులు సైతం కబ్జా చేశారు. తాము చేస్తున్న అక్రమాలు, అన్యాయాలను ప్రశ్నించిన వారిపై లెక్కలేనన్ని అక్రమ కేసులతో జైలుపాలు చేశారు. సాక్షాత్తు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపైనే అక్రమ కేసులు బనాయించి 52 రోజుల పాటు జైలు పాలుచేశారు. వీటన్నింటి పరిస్థితుల్లో అధికార పార్టీపైన రోజురోజుకు ప్రజల్లో వ్యతిరేకత పెరిగిపోతోంది. ఆ పార్టీ గ్రాఫ్ పడిపోతుండగా ప్రతిపక్ష టీడీపీ గ్రాఫ్ పెరుగుతూ వస్తోంది. ఇది చాలదన్నట్లు.. టీడీపీ, జనసేన, బీజేపీలు కలిసి కూటమిగా ఎన్నికల్లో పోటీ చేయనున్నాయి. ఈ నేపథ్యంలో అధికార పార్టీకి ఓటమి భయం పట్టుకుంది. ఓడిపోతే.. ఎలా..? ఎలాగైనా..? ఏం చేసైనా..? గెలవాలి అనుకున్నారు. దీంతో ఒకసారిగా పాహిమాం.. పాహిమాం.. అంటూ వలంటీర్లను శరణు కోరుతున్నారు. ప్రతిపక్ష పార్టీ సానుభూతిపరుల ఓట్లు తొలగించడంతో సహా ఓటర్లను ప్రలోభపెట్టేందుకు కానుకలు ఇవ్వడం. ఇంటింటికీ తిరిగి ఓట్ల కోసం ప్రచారం చేయడం వంటి పనులన్నీ వలంటీర్ల నెత్తిన వేస్తున్నారు. ప్రతి వలంటీరు అధికార పార్టీ నాయకులకు ఆపద్బాంధవుల్లాగా కనిపిస్తున్నారు. దీంతో సుప్రీం కోర్టు ఆదేశాలు సైతం పక్కన పెట్టి వలంటీర్లను బహిరంగంగానే ఎన్నికల ప్రచారంలో తిప్పుతున్నారు

జగనన్నా.. ఇదేనా సిద్ధం..?

రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం పేరుతో ఎన్నికల సమరం కోసం సమావేశాలు నిర్వహిస్తున్నారు. తన వల్ల మేలు కలిగి ఉంటేనే తనకు ఓటు వేయమని పదేపదే చెప్తున్నారు. తాను బటన్లు నొక్కి లబ్ధిదారుల అకౌంట్లలోకి డబ్బు జమ చేశానని, ప్రజలకు మేలు చేయడంలో తనను మించిన వారు ఎవరూ లేరని గొప్పలు పోతున్నారు. దీనిపైనే పలువురు పెదవి విరుస్తున్నారు. ఐదు సంవత్సరాల కాలంలో నిజంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకు మేలు చేసిందే.. నిజమైతే.. ఎమ్మెల్యేలను ఒక నియోజకవర్గం నుంచి మరొక చోటికి మార్చాల్సిన అవసరం ఏముందని ప్రశ్నిస్తున్నారు. నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలు అమలు చేసి ఉంటే పారిశ్రామికంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి నిరుద్యోగులకు ఉపాధి అవకాశం కల్పించి ఉంటే.. పాదయాత్రలో ఇచ్చిన హామీ ప్రకారం.. ఏటా జనవరిలో జాబ్‌క్యాలెండర్ ప్రకటించి ఉంటే.. ఇప్పుడు స్వయంగా ముఖ్యమంత్రే.. వలంటీర్లే తనకు దిక్కు అనేలా మాట్లాడాల్సిన అవసరం ఏముందని ప్రశ్నిస్తున్నారు. ప్రజారంజక పాలన చేసి ఉంటే పార్టీ కార్యకర్తలు, నాయకులను ఎన్నికలకు సిద్ధం చేసి ఉండాలి కానీ.. ప్రభుత్వం నుంచి వేతనాలు పొందుతున్న వలంటీర్లను ఎన్నికలకు సిద్ధం చేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు.

ఇంటింటా ప్రచారం.. కానుకల పంపిణీ

ఎన్నికల ప్రక్రియలో వలంటీర్లను ఎటువంటి పరిస్థితుల్లోనూ జోక్యం చేసుకోనియవద్దని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పింది. అయినా అధికార పార్టీ యథేచ్ఛగా వలంటీర్లను ఎన్నికల ప్రచారంతో పాటు ఓటర్లను ప్రలోభపెట్టేందుకు వినియోగిస్తోంది. వారం రోజులుగా జిల్లా వ్యాప్తంగా వైసీపీకి చెందిన నాయకులు వలంటీర్లను వెంట బెట్టుకుని ఓటర్లను ప్రలోభపెట్టేందుకు పట్టుచీరలు ఉన్న బ్యాగులు పంపిణీ చేస్తున్నారు. జగనన్నకు ఓటేద్దాం.. పేరుతో ఉన్న బ్యాగులు పంపిణీ చేస్తూ గ్రూప్ ఫోటోలు దిగుతున్నారు. ఈ ఫొటోలను ఆయా వాట్సప్ గ్రూపులలో పోస్టు చేస్తున్నారు. జిల్లాలో మొదటగా పీలేరు నియోజకవర్గంలో ఈ చీరల పంపిణీ మొదలు పెట్టారు. ఇప్పుడు రైల్వేకోడూరు, రాజంపేట తదితర నియోజకవర్గాల్లో ఈ చీరల పంపిణీ ఎటువంటి ఆటంకాలు లేకుండా సాఫీగా సాగిపోతోంది. ఇదే సందర్భంలో వలంటీర్లు తమ పరిధిలోని 50 ఇళ్లకు తిరిగి కరపత్రాలతో వైసీపీకి ఓటు వేయమని ప్రచారం చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీకి ఓటు వేయవద్దని, ఓటు వేస్తే ఇప్పుడు అమలవుతున్న సంక్షేమ పథకాలు నిలిచిపోతాయని ప్రచారం చేస్తున్నారు. 50 ఇళ్లకు సంబంధించిన ఓటర్లతో ఉన్న తాము అడ్మిన్‌గా ఉన్న వాట్సప్ గ్రూపులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని పొగడడంతో పాటు ప్రతిపక్ష పార్టీలకు వ్యతిరేకంగా రోజూ పోస్టులు పెడుతున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా విభాగం తయారు చేసి పంపిన సమాచారాన్ని. సుమారు నాలుగైదు నెలల కిందట జిల్లా వ్యాప్తంగా ఓటర్ల వ్యక్తిగత సమాచారాన్ని వలంటీర్ల ద్వారా ప్రభుత్వం సేకరించింది. ఓటర్ల పూర్తి వివరాలు, ఆధార్ కార్డు వివరాలు, ఏ పార్టీకి చెందిన వాళ్లు, ఫోన్ నెంబర్లు, ఓటు కార్డు నెంబరు వంటి వివరాలను సేకరించారు. ప్రస్తుతం జిల్లాలోని ఓటర్ల వ్యక్తిగత సమాచారం అంతా వలంటర్లీ చేతిలో ఉందనే చెప్పవచ్చు. ఈ సమాచారంతోనే పలుచోట్ల ప్రత్యర్థి పార్టీ ఓటర్లను తొలగింపునకు పెద్ద సంఖ్యలో దరఖాస్తులు చేశారు. కొన్నిచోట్ల ఇలా ఓట్లను కూడా తొలగించారని ప్రతిపక్షాలు కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాయి. ఈ నేపథ్యంలో మరో 40 రోజులు మాత్రమే ఎన్నికలకు సమయం ఉండడంతో వలంటీర్ల చేతిలో ఉన్న ఓటర్ల వ్యక్తిగత సమాచారాన్ని అధికార పార్టీ ఏ విధంగా ఉపయోగిస్తుందోననే అనుమానం ప్రతిపక్షాలను వేధిస్తోంది. ప్రస్తుతం జిల్లాలోని దాదాపు అన్ని నియోజకవర్గాల్లోనూ అధికార పార్టీ వలంటీర్లపైనే ఆధారపడడం చూస్తే ఆ పార్టీకి రాబోయే ఎన్నికల్లో ఓటమి తప్పదనే భయం పట్టుకుందని పలువురు బహిరంగంగానే చెబుతున్నారు.



వాల్మీకిపురంలో వైసీపీ నాయకులతో కలిసి ప్రచారం చేస్తున్న వలంటీర్లు (ఫైల్)

శివరాత్రికి ఆర్టీసీ ఆదాయం రూ.39 లక్షలు

మదనపల్లె అర్బన్, మార్చి 9: మహాశివరాత్రికి ప్రత్యేక సర్వీసుల ద్వారా ఆర్టీసీకి రూ. 39లక్షలు ఆదాయం వచ్చినట్లు వన్ డిపో మేనేజరు మూరేవెంకటరమణారెడ్డి తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మదనపల్లె నుంచి తంబళ్లపల్లె మల్లయ్య కొండకు ప్రత్యేక సర్వీసుల ద్వారా 26,352 కిలో మీటర్లు నడిపి రూ. 23,13,291 ఆదాయం సాధించామన్నారు. ఇందులో ఓఆర్ 163 రాగా, ఈపీకే 87.78 వచ్చిందన్నారు. అలాగే హిల్స్‌లో 12,358 కిలోమీటర్లు నడిపి రూ. 15,69,978 సాధించామన్నారు. ఇందులో ఈపీకే 127.04 వచ్చినట్లు డీఎం తెలిపారు.



వైభవంగా మల్లన్న రథోత్సవం

- ముగిసిన మల్లయ్యకొండ బ్రహ్మోత్సవాలు
- హుండీ, సేవా టికెట్ల ద్వారా రూ.12.51 లక్షల ఆదాయం



తంబళ్లపల్లె, మార్చి 9: తంబళ్లపల్లె సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మల్లయ్యకొండలో కొలువైన భ్రమరాంభిక సమేత మల్లికార్జున స్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు శనివారంతో వైభవంగా ముగిశాయి. నాలుగు రోజులపాటు దేవదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో వైభవోపేతంగా నిర్వహించిన బ్రహ్మోత్సవాలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి పరమశివున్ని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి శివపార్వతుల కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. అనంతరం శివపార్వతుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించిన రథంపై అధిష్ఠింపచేసి భక్తులు శివన్నామస్మరణలు నడుమ రాత్రి 12 గంటల నుంచి తెల్లవారుజాము 4 గంటల వరకూ ఆలయం చుట్టూ కోలాహలంగా మెరవణి చేశారు. వేలాదిమంది భక్తులు రాత్రి జాగారం చేసి స్వామి మెరవణిలో పాల్గొన్నారు. శనివారం అర్చకులు ఈశ్వరప్ప స్వామి వారికి ప్రత్యేకాభిషేకాలు, పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా డీఎస్పీ ప్రసాదరెడ్డి, ట్రైనీ డీఎస్పీ ప్రశాంత్ ఆధ్వర్యంలో సీఐ మధు, ఎస్ఐ శివకుమార్ గట్టి బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మల్‌రెడ్డి, ఈవో రమణ, పాలకమండలి సభ్యులు సుదర్శన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఆలయ సిబ్బంది ఈశ్వర తదితరులు పాల్గొన్నారు.

రూ.12.51 లక్షల ఆదాయం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భక్తులు హుండీలలో సమర్పించిన కానుకలు, వివిధ సేవా టికెట్ల ద్వారా మల్లయ్యకొండకు రూ.12,51,219 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో రమణ తెలిపారు. శనివారం మల్లయ్యకొండపైన ఆలయంలో ఈవో, చైర్మన్ కేఆర్ మల్‌రెడ్డిల ఆధ్వర్యంలో హుండీ కానుకలను లెక్కించారు. సేవా టికెట్ల ద్వారా రూ.3,46,261, హుండీ కానుకల ద్వారా రూ.9,04,958 మొత్తం రూ.12,51,219 ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

హుండీ లెక్కింపు కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు సుదర్శన్‌రెడ్డి, సిబ్బంది, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.



స్వామివారి మెరవణిని తిలకించడానికి వచ్చిన భక్తులు



ఝరిలో స్నానాలు చేస్తున్న భక్తులు


భక్తజన ఝరి

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- కిక్కిరిసిపోయిన సత్యవతి నది

కలకడ, మార్చి 9: కలకడ సత్యవతి నది తీరాన వెలసిన కామాక్షి సమేతా సిద్దేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం జరిగిన ఝరి ఉత్సవాలకు వేలాదిగా భక్తులు తరలిరావడంతో ఆ ప్రాంతం భక్తజన ప్రవాహంగా మారింది. సత్యవతి, బాహుదా నదులు సంగమంతో ఏర్పడి కొండ కోనల మధ్య ప్రవహించే ఝరిలో మునిగితే పాపాలు ఈడేరి పుణ్యం దక్కుతుందని భక్తుల విశ్వాసం. మహాశివరాత్రి జాగరణ పూర్తి చేసుకున్న భక్తులు వేకువజాము నుంచే ఝరికి చేరుకుని పుణ్యస్నానాలు చేశారు. ఈ ప్రక్రియ సాయంత్రం వరకు నిరంతరంగా కొనసాగింది. రాయలసీమ జిల్లా నుంచే కాక విజయవాడ, గుంటూరు, నెల్లూరు, హైదరాబాదు, చెన్నై, బెంగళూరు, యలహంక, చింతామణి, శ్రీనివాసపురం తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఉత్సవాలలో పాల్గొని ఝరిలో స్నానాలు చేశారు. అనంతరం అక్కడక్కడా ఇసుకలో శివలింగాకృతులు ఏర్పాటు చేసి కొబ్బరి కాయలు కొట్టి శివనామస్మరణ చేశారు. కాగా కలకడ, కలికిరి, కె.వి.పల్లె, కురబలకోట, సంబేపల్లె మండలాల నుంచి గ్రామదేవతలు, దేవరేద్దులను మాన్యాలతో తప్పెట్లు, పలకలు, పిల్లన్నగ్రోవులు కోలాహలంగా ఊరేగింపుగా తీసుకొచ్చి ఝరిలో జలాభిషేకం చేశారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ కార్యక్రమాలను భక్తులు ఆసక్తిగా తిలకించారు. శివనాస్మరణతో కొండ కోనలు పులకించాయి. ఝరి ఉత్సవాలలో భాగంగా మదనపల్లె-2 డిపో నుంచి 15 బస్సులు, పీలేరు డిపో నుంచి 9 ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపినట్లు ఆర్టీసీ అధికారులు నరసింహారెడ్డి, డీఎస్ఎన్ రెడ్డి, రమణ తెలిపారు. అలాగే ఝరి వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. శివశక్తి శాలివాహన సేవా సమితి ఆధ్వర్యంలో రెండు వేల మందికి అన్నదానం చేశారు. అలాగే ఝరికి వెళ్లే మార్గంలో ఎర్రయ్యగారిపల్లె వద్ద సుమారు 5 వేల మందికి, ఝరి వద్ద 5 వేల మందికి, అలాగే కె.వి.పల్లె మార్గంలో కూడా పలువురు దాతలు అన్నదానం చేశారు.

వృషభ వాహనంపై సిద్దేశ్వరుడు

కామాక్షి సమేతా సిద్దేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను శుక్రవారం రాత్రి నుంచి శనివారం వేకువజాము వరకు వృషభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. కమ్మ సంఘం ఆధ్వర్యంలో వాహనాన్ని విద్యుత్ దీపాలు, స్వామి, అమ్మవార్లను వివిధ పూల మాలలతో అలంకరించి బళ్లారి డ్రములు, బాణసంచులు పేల్చుతూ వేడుకగా ఆలయం వద్ద నుంచి ఎర్రయ్యగారిపల్లె మీదుగా కలకడ వరకు ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు సుబ్రమణ్యస్వామి, మద్దిపట్ల వెంకటరమణనాయుడు, రెడ్డెప్పనాయుడు, శ్రీనివాసులనాయుడు, రామయ్యచౌదరి, రెడ్డిశేఖర్, మల్లికార్జునాయుడు, కుమార్ నాయుడు పాల్గొన్నారు.



కేవీ పల్లె మండలం నుంచి నాణ్యాలు తీసుకొస్తున్న గ్రామస్థులు

కేంద్ర బలగాల కవాతు



పీలేరులో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులు

పీలేరు, మార్చి 9: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బందోబస్తు నిమిత్తం పీలేరు నియోజకవర్గానికి నియమితులైన కేంద్ర బలగాలు శనివారం సాయంత్రం పీలేరు పట్టణంలో కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా రాయచోటి డీఎస్పీ మహబూబ్ బాషా మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు తమ శాఖ సిద్ధంగా ఉందని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఎటువంటి సంఘటనలను ఉపేక్షించబోమన్నారు. ప్రస్తుతం కేంద్ర బలగాలు వచ్చాయని, మరికొన్ని బలగాలు కూడా త్వరలోనే చేరుకుంటాయని ఆయన వివరించారు. అనంతరం ఆయన కేంద్ర బలగాలతో కలిసి పీలేరు పట్టణంలోని అన్ని వీధుల్లో కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో పీలేరు అర్బన్ సీఐ మోహన్ రెడ్డి, ఎస్ఐ నరసింహుడు, సిబ్బంది పాల్గొన్నారు.

కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి గంగమ్మతల్లి

- రాయలసీమకే తలమానికం
- నేటి నుంచి 12 వరకు అనంతపురం గంగమ్మ జాతర



గంగమ్మ తల్లి ఆలయం

లక్కిరెడ్డిపల్లె మార్చి 9: మండలంలోని అనంతపురంలో వెలసిన గంగమ్మ తల్లి రాయలసీమకే తలమానికంగా నిలిచింది. భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా గంగమ్మతల్లిని భక్తులు కొలుస్తున్నారు. మూడు రోజుల పాటు జరిగే గంగమ్మ జాతర భక్తులతో కిటకిటలాడుతుంది. ఈ జాతరకు రాయలసీమ నుంచే కాకుండా బెంగళూరు, చెన్నై నుంచి లక్షల సంఖ్యలో భక్తులు తరలివస్తారు. అమ్మవారి పూజారులైన చెల్లు వంశీయులు ఇంటి నుంచి శనివారం రాత్రికి జాతరకు చేరుకుంటారు. ఆదివారం నుంచి మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా జాతర జరుగుతుంది. అమ్మవారి పుట్టినిల్లు అయిన చాగలగుట్టపల్లె నుంచి 11వ తేదీ సోమవారం ఉదయం తెల్లవారుజామున అమ్మవారు అత్యంత వైభవంగా బ్యాండ్‌వాయిద్యాలు, బాణాసంచా పేలుళ్లు, ఊరేగింపుతో పల్లకీలో జాతరకు చేరుకుంటుంది. అమ్మవారు జాతరకు వచ్చే రోజు నిండు తిరుణాలతో గంగమ్మజాతర ప్రారంభమవుతుంది. అమ్మవారు గుడిలోకి రాగానే చెల్లు వంశీయులు స్వాగతం పలికి పట్టువస్త్రాలు సమర్పించి అమ్మవారికి ఇష్టమైన కళ్లు, కోరలు, బెంగళూరు నించి తెచ్చిన పూలతో అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేసి పూజలు ప్రారంభిస్తారు అనంతరం ఈడిగపల్లెకు చెందిన గౌడ వంశీయులు అమ్మవారికి కల్లు తీర్థంగా సమర్పిస్తారు. అమ్మవారికి ప్రసాదంగా సిద్దల కూడు సమర్పించి ఆ ప్రసాదాన్ని సంతానం కోసం వరపడిన మహిళలు, అనారోగ్యంతో బాధపడేవారికి ప్రసాదం అందజేసి దర్శనం చేయిస్తారు. 11వ తేదీ నిండు తిరుణాల రోజున రాత్రికి కుంకుమబండ్లు, చాందినీబండ్లు, నీలిబండ్లు అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదర్శనలు చేస్తాయి. అమ్మవారి ఊరేగింపులో బాణాసంచాలతో అత్యంతవైభవంగా ఊరేగింపు జరుగుతుంది. మరసటిరోజు 12వ తేదీ పైలు తిరుణాల రోజున సాయంత్రానికి అమ్మవారు పుట్టినిల్లు అయిన చాగలగుట్టపల్లెకు తిరిగి వెళుతుంది.

అమ్మవారి చరిత్ర

ప్యారంపల్లెకు చెందిన తిమ్మిరెడ్డి ఉత్తారెడ్డి అనే రైతు తన పొలానికి కంచె వేసేందుకు కంపతొడుగులు వేయించగా ఆ కంపతొడుగు కిందనే అమ్మవారు ఉన్నారని ఎంతసేపటికీ కంపతొడుగు బయటకు రాకపోవడంతో 7 గాండ్లు ఎడ్లను తీసుకొచ్చి ఈడ్చగా ఎంతసేపటికీ కంప తొడుగు రాకపోవడంతో ఆరోజు వదిలేసి వెళ్లిపోయాడు. అదేరోజు రాత్రి ఉత్తారెడ్డికి కలలోకి వచ్చి నేను అండి అనంతపురం నుంచి వచ్చి ఇక్కడ కొలువుతీరానని నాకు ఇక్కడ గుడి ఏర్పాటు చేసి పూజలు చేయాలని అమ్మవారు ఆ రైతుకు చెప్పడంతో మరుసటిరోజు ఆ కంపతొడుగు ప్రాంతంలో చిన్న గుడి ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారని పూర్వీకులు చెప్పుకుంటున్నారు. అంతేకాకుండా ఇంకొక రూపంలో చాగలగుట్టపల్లెకు చెందిన పల్లు వంశీయులైన ఇంటికి చేరుకుని నాకు గొల్లపల్లెకు చెందిన చెల్లు వంశీయులు పూజారులుగా ఉండి తమకు పూజలు నిర్వహించాలని అమ్మవారు చెప్పారని అప్పటి నుంచి నేటి వరకు చెల్లు వంశీయులు అమ్మవారి పూజారులుగా కొనసాగుతున్నారు.



ఆలయంలో కొలువైన అమ్మవారు

సాంస్కృతిక కార్యక్రమాలు

సోమవారం రాత్రి ఆసాదులచే గంగమ్మ తల్లి కథ ప్రమీల భాగవతారిచే హరికథ, బుర్రకథ, చెక్కభజనలు, రేలారే రేలా, జబర్దస్త్ ప్రోగ్రాం, ఆర్కెస్ట్రా కార్యక్రమాలు, గువ్వలచెరువు డిస్కో రమణచే చెక్కభజనలు, కోలాటాల కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.



చాగలగుట్టపల్లెలో అమ్మవారు ఉండే నిలయం

అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం



ఈనెల 11, 12 తేదీల్లో జరగబోవు గంగమ్మ జాతరకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. జాతరలో భక్తులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా తాగునీరు, మహిళలకు ప్రత్యేక స్నానవాటికలు, మరుగుదొడ్లు, చలువ పందిళ్లు ఏర్పాటు చేశాము. జాతర ప్రాంగణమంతా సీసీ కెమెరాలు, జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశాం.

- రవీంద్రరాజు, ఈఓ

ఆలయ అభివృద్ధికి కృషి



గంగమ్మ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా. జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.

జాతరలో ఎటువంటి సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరిపేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం. ఆలయ పడమటి రాజగోపురం, దాతల సహకారంతో మర్రిమాను, లక్కిరెడ్డిపల్లె, చిట్లూరు ప్రాంతాలలో స్వాగత తోరణాలు ఏర్పాటు చేస్తాం.

- మురికినాటి రెడ్డెయ్య, ఆలయ చైర్మన్

విద్యుత్ తీగలు తగిలిన విద్యార్థి మృతి



సింహాద్రి (ఫైల్)

ప్రమాదానికి కారణమైన ట్రాన్స్‌ఫార్మర్

బి.కోడూరు, మార్చి 9 : మండల పరిధిలోని తంగేడుపల్లెలో ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగలడంతో బత్తల సింహాద్రి (12) అనే విద్యార్థి మృతి చెందాడు. తంగేడుపల్లెకు చెందిన బత్తల సిద్దయ్య పెద్ద కుమారుడు గురువారం మేకలు మేపుకుంటుండగా సింహాద్రి తన అన్నకు అన్నం తీసుకుని వెళుతుండగా పొలాల్లో ఓ రైతు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తీగలు తెగి కింద పడి ఉన్నాయి. అది గమనించక ఆ విద్యార్థి దానిపై వెళ్లడంతో కాళ్లకు చుట్టుకుని పూర్తిగా శరీర భాగాలు కాలిపోయాయి. దీంతో చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కాగా మృతుడు సింహాద్రి బద్వేలు ప్రభుత్వ పాఠశాలలో 6వతరగతి చదువుతున్నాడు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన యువకుడు

ముద్దనూరు మార్చి 9: మండల పరిధి జమ్మలమడుగు రోడ్డులోని పులికోన ఘాట్ వద్ద శనివారం సాయంత్రం బైకు ప్రమాదంలో గుర్తు తెలియని యువకునికి తీవ్రగాయాలయ్యాయి. గుర్తుతెలియని వ్యక్తి బైకుపై జమ్మలమడుగు వైపు నుంచి వస్తూ అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యాడు. వెంటనే ఆ దారిన వస్తున్న ప్రయాణికులు చూసి 108కు సమాచారం అందించారు. తీవ్ర గాయాలవడంతో 108లో జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, మెరుగైన చికిత్స కోసం అక్కడినుంచి ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రూ.20 లక్షలు స్వాధీనం

ఎర్రగుంట్ల, మార్చి 9: ఎర్రగుంట్ల-ప్రొద్దుటూరు బైపాస్ రోడ్డు వై-జంక్షన్ వద్ద శనివరం తెల్లవారుజామున వాహనాలు తనిఖీ చేస్తుండగా ప్రొద్దుటూరుకు చెందిన మార్తల వెంకటరామిరెడ్డి వద్ద నుంచి రూ.20 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఈశ్వరయ్య తెలిపారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా వెంకటరామిరెడ్డి వై-జంక్షన్ వద్ద బ్యాగు పట్టుకుని అనుమానాస్పదంగా నిలుచున్నాడని, తనిఖీ చేయగా అతడి వద్ద రూ.20 లక్షలు ఉన్నట్లు తెలిపారు. అతను కర్నాటక నుంచి హరిప్రియ ఎక్స్‌ప్రెస్‌కు వచ్చి ఎర్రగుంట్లలో దిగాడు. బస్సు కోసం ప్రొద్దుటూరు రోడ్డు వై-జంక్షన్ వద్ద ఉండగా సీఐ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో తనిఖీలు చేయగా నగదు దొరికినట్లు తెలిపారు. డబ్బు స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి సంబంధిత అధికారులకు పంపామన్నారు. అలాగే గోవా నుంచి నాలుగు లీటర్ల మద్యంతో వాస్కోడిగామా ఎక్స్‌ప్రెస్‌లో వచ్చి ఎర్రగుంట్లలో దిగిన దువ్వూరుకు చెందిన ఇరగంరెడ్డి నాగమల్లేశ్వరరెడ్డి వద్ద నుంచి స్వాధీనం చేసుకుని అతడిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

37 మద్యం బాటిళ్లు స్వాధీనం

కొండాపురం, మార్చి 9: పట్టణంలో 37 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కొండాపురం గ్రామానికి చెందిన నారాయణ 37 మద్యం బాటిళ్లను అనుమతి లేకుండా విక్రయిస్తుండగా వాటిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ నరసింహులు తెలిపారు.

ఇటుకులపాడులో గడ్డివామి దగ్ధం



కాశినాయన మార్చి 9: ఇటుకులపాడులో అనుమానాస్పద స్థితిలో పాములూరి వెంగటయ్యకు చెందిన గడ్డివామి దగ్ధమైనట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామస్థులు, బాధితుల వివరాల మేరకు... శనివారం సాయంత్రం ఉన్నఫళంగా గడ్డివామిలో మంటలను గుర్తించి స్థానికులు పోరుమామిళ్ల అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చేలోపు గడ్డివామి పూర్తిగా కాలిపోయిందని బాధితుడు వాపోయాడు. ప్రమాదంలో 300 కట్టల గడ్డికాలిపోయిందని, దాదాపు రూ.30 వేలు నష్టం వాటిల్లిందన్నారు.

పారదర్శకంగా ఇంటర్ పరీక్షలు


ఆర్ఐవో వెంకటసుబ్బయ్య



ఆర్ఐవో కార్యాలయంలో సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్న అధికారులు


కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 9 : ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు పారదర్శకంగా జరుగుతున్నాయని ఆర్ఐవో వెంకటసుబ్బయ్య తెలిపారు. ఆర్ఐవో కార్యాలయంలో ఇంటర్మీడియట్ బోర్డు నుంచి సైతం పర్యవేక్షణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాస్ కాపీయింగ్‌కు ఎటువంటి తావు లేకుండా పరీక్షలు పారదర్శకంగా జరుగుతున్నాయన్నారు. గత ఏడాది కంటే విద్యార్థులు ఈ ఏడాది పెరిగారని 69 కేంద్రాల్లో ఈ పరీక్షలు రాస్తున్నట్లు స్పష్టం చేశారు. జిల్లాలో శనివారం జరిగిన ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు జనరల్ ఒకేషనల్ కోర్సులకు బి.జువాలజీ, హిస్టరీ పరీక్షలకు 14,758 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 14,152 మంది హాజరయ్యారన్నారు. 606 మంది గైర్హాజరైనట్లు ఆయన వివరించారు.

న్యూఢిల్లీ సాహితీ సదస్సుకు వేంపల్లె గంగాధర్



కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 9: న్యూఢిల్లీలోని కేంద్ర సాహిత్య అకాడమీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ఫెస్టివల్ ఆఫ్ లెటర్స్ సదస్సులో పాల్గొనడానికి జిల్లాకు చెందిన రచయిత డాక్టర్ వేంపల్లె గంగాధర్‌కు ఆహ్వానం అందింది. న్యూఢిల్లీలోని రవీంద్రభవన్‌లో ఈనెల 11 నుంచి 16వ తేదీ వరకు జరిగే జాతీయ సదస్సులో పాల్గొననున్నారు. మార్చి 13న జరిగే వివిధ ప్రాంతీయ భాషల కథల ఆవిష్కరణ కార్యక్రమంలో ఈయన తెలుగు కథ వినిపించనున్నారు. జిల్లాకు చెందిన ఈయన ఇప్పటివరకు మొలకల పున్నమి, దేవరశిల, గ్రీష్మభూమి, పాపాఘ్ని కథలు, రావణ వాహనం కథలు, గంగమ్మపూలు కథా సంపుటాలు, నేల దిగినవాన, యురేనియం మింగిన పల్లె నవలలు ప్రచురించారు. మొలకల పున్నమి కథల సంపుటానికి కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారాన్ని 2011లో అందుకున్నారు.

ఆరుగురు ఎస్‌జీటీలకు పదోన్నతులు



పదోన్నతుల కౌన్సెలింగ్‌లో డీఈఓ అనురాధ

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 9: జిల్లాలో ఆరుగురు ఎస్‌జీటీలకు స్కూలు అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించినట్లు జిల్లా విద్యా శాఖ అధికారిణి అనురాధ తెలిపారు. శనివారం కడప నగరం డీఈఓ కార్యాలయంలో స్పెషల్ ఎడ్యుకేషన్ బీఈడీ చేసిన అభ్యర్థులకు పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిల్లాలో స్పెషల్ ఎడ్యుకేషన్ బీఈడీ చేసిన ఆరుగురు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూలు అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించామన్నారు. కార్యక్రమంలో డీఈఓ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.



ప్రధానోపాధ్యాయులకు పరీక్ష..!

- ఎన్నికలు వస్తున్నాయని 'నాడు-నేడు' నిధులు మంజూరు
- పనులు త్వరగా పూర్తి చేయాలంటూ హెచ్‌ఎంలపై వత్తిడి
- టెన్త్ పబ్లిక్ పరీక్షల వేళ పనులు చేసేదెలా?
- తలలు పట్టుకుంటున్న హెచ్‌ఎంలు
- మండిపడుతున్న ఉపాధ్యాయ సంఘాలు

పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా వైసీపీ ప్రభుత్వం ప్రారంభించిన నాడు-నేడు పథకం నిధుల కొరతతో పడకేసింది. ఈ పథకంలో రెండో దశ పనులు అస్తవ్యస్తంగా మారాయి. రెండో విడత పనులు 2022 జూలై నాటికి పూర్తి చేస్తామని అప్పట్లో ప్రకటించారు. తర్వాత మరో ఏడాది పొడిగించారు. అయినా నిధులు విడుదల కాక పనులు అరకొరగా నిలిచిపోయాయి. ప్రస్తుతం ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో వైసీపీ ప్రభుత్వం కొంతమేర నిధులు విడుదల చేసి త్వరితగతిన పనులు పూర్తిచేయాలని ప్రధానోపాధ్యాయులపై వత్తిడి తెస్తోంది. ఓ పక్క ఈ నెల 18 నుంచి పదో తరగతి పరీక్షలు, మరో పక్క నాడు నేడు పనులు పూర్తిచేయాలని వత్తిడి. దీంతో ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో ప్రధానోపాధ్యాయులు సతమతమవుతున్నారు. దీనిపై ఉపాధ్యాయ సంఘాలు కూడా మండిపడుతున్నాయి.



చాపాడు మండలంలో పునాదులకే పరిమితమైన ఓ ప్రాథమిక పాఠశాల

కడప (ఎడ్యుకేషన్), మార్చి 9: రాష్ట్ర ప్రభుత్వం నాడు నేడు కార్యక్రమంతో పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే ఫేజ్-1 కింద పాఠశాలల్లో పనులు పూర్తి చేసింది. ఫేజ్-2 కింద పాఠశాలలు ఎంపిక చేసి ఒకటిన్నర సంవవత్సరం కావస్తోంది. దీనికి నిధులు మంజూరు చేసి మరమ్మతులు పూర్తికాకముందే నిధులు పెండింగ్ పెట్టింది. దీంతో నాడు-నేడు పనులు పూర్తిగా నిలిచిపోయాయి. నిధులు సకాలంలో విడుదల చేస్తే నాడు-నేడు పనులు పూర్తి చేస్తామని ప్రధానోపాధ్యాయులు విన్నవించినా ఫలితం లేకుండాపోయింది. ప్రస్తుతం పరీక్షలు, ఎన్నికలపై పాఠశాల సిబ్బంది నిమగ్నమైన ఉన్న వేళ అరకొర నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం నాడు-నేడు పనులు ప్రారంభించాలని తొందరపెడుతోంది. దీంతో సంబంధిత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు తీవ్ర వత్తిడికి గురవుతున్నారు. విద్యా సంవత్సరం చివరిలో నిధులు విడుదల చేస్తే ఏ విధంగా పనులు పూర్తవుతాయని ప్రశ్నిస్తున్నారు. నిన్నటి వరకు జరిగిన పదో తరగతి ప్రీఫైనల్ పరీక్షలు, ఎఫ్ఎ-4 మూల్యాంకనం, ఆన్‌లైన్ మార్కుల నమోదుపై పూర్తి స్థాయిలో పాఠశాల సిబ్బంది నిమగ్నమై ఉన్న సందర్భంలో నాడు-నేడు పనులు పూర్తి చేయాలని ఆదేశించడం పట్ల విమర్శలు వస్తున్నాయి.

గత ఏడాదీ ఇదే తీరు..

గత సంవత్సరం సైతం చివర్లో నిధులు మంజూరు చేసి ఉపాధ్యాయులతో వేసవి సెలవుల్లో నాడు-నేడు పనులు చేయించింది. ఈ ఏడాది ఒక వైపు ఎన్నికల విధులకు సంబంధించిన శిక్షణ జరుగుతుంటే మరో వైపు పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు కేంద్రాలను, విద్యార్థులను సిద్ధం చేసేందుకు ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక ప్రణాళికల రూపు దిద్దుకుంటుంటే.. నాడు-నేడు పనులు సక్రమంగా జరుగుతాయా అన్న ప్రశ్న తలెత్తుతోంది. తక్కువ సమయంలో ఆదరా బాదరాగా పనులు పూర్తి చేస్తే రాబోవు ఆడిట్‌లో ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురికాక తప్పదని పలువురు బహిరంగంగా మాట్లాడుతున్నారు. జిల్లాలో ఒక పాఠశాలకు ఇంకా రూ.30 లక్షలకు పైగా నిధులు మంజూరు కావాల్సి ఉంటే కేవలం రూ.10 లక్షలు మాత్రమే విడుదల చేశారు. దీంతో ఏ పనులకు ఎంత ఖర్చు పెట్టాలో అర్థంకాక ప్రధానోపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. అన్ని పాఠశాలల పరిస్థితి అలాగే ఉంది. పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో నాడు నేడు పనులు ఏ విధంగా కొనసాగించాలని వాపోతున్నారు. ఒకటిన్నర నెలలో విద్యా సంవత్సరం ముగుస్తుండగా ఈ ఆర్భాటమేమిటి, ఎన్నికల కోసమే ఈ ఆరాటం అని పలువురు పేర్కొంటున్నారు. పాఠశాల సిబ్బందిపై వత్తిడి చేసి ఎలాగైనా ఎన్నికల కోడ్ ముందే పనులు పూర్తిచేయించడానికి ప్రభుత్వం సిద్ధపడుతున్నట్టు తెలుస్తోంది.

రెండో విడత వివరాలిలా..

నాడు-నేడుకు సంబంధించి జిల్లావ్యాప్తంగా రెండో విడత కింద 87 అంగన్వాడీ కేంద్రాలు, 637 ప్రాథమిక పాఠశాలలు, 75 ప్రాథమికోన్నత పాఠశాలలు, 197 హైస్కూళ్లు, 9 జూనియర్ కళాశాలలు మొత్తం 1005 వాటిలో అభివృద్ధి పనులు నిర్వహించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వీటిలో తాగునీరు, విద్యుత్ సౌకర్యం, ఫర్నీచర్, గ్రీన్‌చాక్ బోర్డు, కిచెన్ షెడ్డు, ఇంగ్లీషు ల్యాబ్, పెయింట్ తదితర పనులు చేసేందుకు నిర్ణయించింది. దీని కోసం ప్రభుత్వం రూ.296.62 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఇందులో రూ.147.81 కోట్లు నిధులను ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేపట్టారు. ఆ తరువాత నిధులు మంజూరు కాకపోవడంతో కొన్ని పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం నాడు-నేడు పనుల్లో భాగంగా తాజాగా 809 పాఠశాలలకు రూ.21.28 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో పాఠశాలల్లో పెండింగులో ఉన్న పనులు త్వరితంగా పూర్తిచేయాలని ప్రధానోపాధ్యాయులపై వత్తిడి తెస్తున్నారు. మార్చి చివరి నాటికి పనులు పూర్తి చేయాలని ఆదేశిస్తున్నారు. ఇదే సమయంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు కూడా జరగనున్న నేపథ్యంలో ప్రధానోపాధ్యాయులపై మరింత వత్తిడి పెరిగిందని చెప్పాలి. ఒక పక్క పదో తరగతి పరీక్షలు నిర్వహించాలా, మరో పక్క నాడు-నేడు పనులు పూర్తిచేయాలా అంటూ తలలు పట్టుకుంటున్నారు.

పెండింగు నిధులు మంజూరు చేయాలి..



నాడు-నేడు పాఠశాలకు ఉన్న పెండింగు నిధులు త్వరితగతిన విడుదల చేయాలి. ఉపాధ్యాయులను నాడు-నేడు బాధ్యతల నుంచి తప్పించి పూర్తిగా ఇంజనీరింగ్ విభాగానికి మరలించాలి. పరీక్షలు, ఎన్నికలవేళ ఉపాధ్యాయులు విధుల్లోకి వెళుతున్నందున నాడు-నేడు పనుల నుంచి మినహాయింపునివ్వాలి. లక్ష్య సాధనకు ప్రభుత్వమే ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలి.

- సీవీ ప్రసాద్, ఏపీటీఎఫ్, అమరావతి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ

నాడు - నేడు ఆలస్యం వల్ల కొంత ఇబ్బందే..



నాడునేడు పనులు పూర్తయి ఉంటే పదో తరగతి విద్యార్థులకు పరీక్షల్లో సౌకర్యంగా ఉండేది. నిధులు సకాలంలో విడుదల అయితే పనులు కూడా పూర్తయ్యేవి. సౌకర్యవంతమైన పరీక్ష కేంద్రాల వల్ల విద్యార్థులకు సౌలభ్యంగా ఉండేది. ఇప్పుడు కొన్ని పాఠశాలల్లో పనులు పూర్తికానందున కొన్ని పరీక్ష కేంద్రాలు రద్దు చేయడం, లేదా మార్పు చేయడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడే అవకాశం ఉంది.

- కె.సురేశ్‌బాబు, ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు

రేపటి నుంచి గంగమ్మ జాతర





గంగమ్మతల్లి మూలవిరాట్, గంగమ్మ తిరుణాలకు వెళ్లే ఆర్చి, (అంతరచిత్రంలో) రోడ్డుకు స్థలమిచ్చిన రైతు రామచంద్రయ్య

సీకేదిన్నె, మార్చి 9: చింతకొమ్మదిన్నె గంగమ్మ జాతర సోమవారం నుంచి ప్రారంభం కానుందని ఆలయ ఈఓ సురేష్ కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రతియేటా మహాశివరాత్రి పర్వదినం ముగిసిన మూడవ రోజు నుంచి తిరుణాల ప్రారంభం అవుతుందన్నారు. మొదటిరోజు నిండు తిరుణాల, రెండవ రోజు మైల తిరుణాల నిర్వహించడం ఆనవాయితీ అన్నారు. తిరుణాల ముగిసిన అనంతరం వారాలు ప్రారంభం అవుతాయన్నారు. తిరుణాల ముగిసిన అనంతరం ఉగాదిలోపు ఆదివారాలను ప్రతివారం అమ్మవారికి ఘనంగా నిర్వహిస్తారన్నారు. మొదటివారం 17వ తేదీ, 24వ తేదీ రెండో ఆదివారం, 31న 3వ ఆదివారం, 7వ తేదీ 4వ ఆదివారం నిర్వహిస్తారని వివరించారు.

రోడ్డు ఏర్పాటుతో ప్రతి ఆదివారం పండుగే

గతంలో గంగమ్మ జాతరకు వెళ్లేందుకు దారి సరిగా లేక భక్తులు ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యను గమనించిన బయనపల్లె రైతు వినుకోలు రామచంద్రయ్య తన సొంత పొలంలో కడప-రాయచోటి జాతీయ రహదారి నుంచి తిరుణాల వరకు దాదాపు అర ఎకరా వరకు రోడ్డుకు స్థలం ఇచ్చి ఆర్చి నిర్మాణం చేయడంతో భక్తులు రాకపోకల అధికంగా ఉంటున్నాయి. దీంతో గతంలో వారాలతోనే ఆగిపోయే తిరుణాల ప్రస్తుతం ప్రతి ఆదివారం భక్తులతో అక్కడ పండుగ వాతావరణం నెలకొంటోంది.

అమ్మవారి కల్యాణం ప్రత్యేకత

ఇక్కడ ప్రతి వారం తిరుణాలలో భాగంగా అమ్మవారి కల్యాణం నిర్వహించడం ఇక్కడ ప్రత్యేకత. నిండుతిరుణాలలో భాగంగా 11వ తేదీ రాత్రి అమ్మవారి కల్యాణం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించడంతోపాటు ముత్యాల తలంబ్రాలను పంపిణీ చేస్తారు.

జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి

గంగమ్మతల్లి జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈఓ, చైర్మన్ తెలిపారు. అదేవిధంగా 11వ తేదీ మొదటి రోజు కోలాటం, బండలాగుడు పోటీలు, ఆర్కెస్ట్రా, ఆధ్యాత్మిక ప్రవచనాలు ఏర్పాటు చేశారన్నారు. రెండవ రోజు చెక్కభజన, కోలాటం ఉంటుందన్నారు. భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

కడపలో వ్యక్తి కిడ్నాప్ కలకలం..!

33 తులాల బంగారం లాక్కెళ్లారని ఆరోపణలు ● విచారణ చేసి చర్యలు తీసుకుంటాం : టూటౌన్ సీఐ

కడప (క్రైం), మార్చి 9: కడప నగరం టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో శనివారం తెల్లవారుజామున ఓ వ్యక్తిని కిడ్నాప్ చేసి 33 తులాల బంగారు ఆభరణాలను లాక్కెళ్లారని సోషల్ మీడియాలో జరిగిన ప్రచారం హల్‌చల్ చేసింది. రంగంలోకి దిగిన పోలీసులు స్థానికుల సమాచారంతో కొన్ని ఆసక్తికర విషయాలు వెలుగు చూశాయి. కడప నగరంలోని ఖలీల్‌నగర్‌కు చెందిన ఇలియాస్ తన స్నేహితుడు వినాయక్‌నగర్‌కు చెందిన బిలాల్‌తో కలిసి ఫిబ్రవరి 19న దుబాయ్ వెళ్లి వస్తానని ఇంటిలో చెప్పి వెళ్లాడు. 21న అక్కడికి చేరుకున్నాడు. అదే నెల 26న ఇలియాస్ కడపకు వెళతానని స్నేహితుడికి చెప్పి అక్కడి నుంచి తిరిగి వచ్చాడు. వచ్చేటప్పుడు బిలాల్ తన దగ్గరున్న డబ్బుతో పాటు 43 తులాల బంగారు ఆభరణాలు కొనుగోలు చేసి ఇలియాస్ చేతికి ఇచ్చి కడపలో తన బంధువులకు ఇవ్వమని చెప్పి పంపాడు. ఇలియాస్ 26న తెల్లవారుజామున ముంబైలో దిగాడు. అక్కడి నుంచి డార్జిలింగ్‌లో ఉన్న తన రెండో భార్య వద్దకు వెళ్లాడు. తరువాత ఈనెల 6న డార్జిలింగ్ నుంచి హైదరాబాదు వెళ్లాడు. అక్కడ నుంచి బిలాల్‌కు, ఇలియాస్‌కు ఇద్దరికీ స్నేహితుడైన అస్లాం ద్వారా ఈ నెల 8న రాత్రి 11 గంటలకు హైదరాబాదులో బస్సు ఎక్కి శనివారం తెల్లవారుజామున కడప ఏడురోడ్ల కూడలిలో బస్సు దిగి ఇంటికి వెళ్లేందుకు ఆటో ఎక్కాడు. అప్పటికే బిలాల్ తన స్నేహితులకు, కుటుంబ సభ్యులకు ఇలియాస్ దుబాయ్ నుంచి కడపకు బంగారును తీసుకుని వచ్చాడని, వస్తే అతడి వద్ద నుంచి అవి తీసుకోవాలని చెప్పారు. తన దగ్గర నుంచి వచ్చినప్పటి నుంచి ఇలియాస్ ఫోను పనిచేయడం లేదని కూడా చెప్పాడు. ఈ క్రమంలో బిలాల్‌కు ఇలియాస్‌కు స్నేహితుడైన అస్లాం గత రాత్రి హైదరాబాదులో బస్సు ఎక్కిన విషయం బిలాల్‌కు తెలిపాడు. ఇలియాస్ కడపలో బస్సు దిగి ఆటో ఎక్కగానే బిలాల్ బంధువు హుస్సేన్, పర్వేజ్, మరో ఇద్దరు స్నేహితులు కలిసి వెంబడించారు. శివలింగం బీడీ వీధిలోకి రాగానే అక్కడ నుంచి అతడితో వాగ్వాదానికి దిగారు. తరువాత అతడిని కిడ్నాప్ చేసి తమ ఆటోలో తీసుకెళ్లారు. కొంతసేపటికి ఇలియాస్ కిడ్నాప్‌నకు గురయ్యాడని అతడి తల్లి పోలీసుస్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసింది. వెంటనే రంగంలోకి దిగిన సీఐ ఇబ్రహీం, పోలీసులు ఇలియాస్ ఆచూకీ కోసం వెతికారు. కొంత సమయానికి ఇలియాస్ తాను క్షేమంగానే ఉన్నానని, తన వద్దకు వచ్చిన వారు 33 తులాల బంగారు ఆభరణాలను బలవంతంగా లాక్కెళ్లారని ఫిర్యాదు చేశాడు. బాధితుడిని పోలీసులు విచారించగా తాను బిలాల్ పంపిన 43 తులాల బంగారులో 10 తులాలు అమ్మేసి జల్సా చేశానని, మిగిలిన 33 తులాలు వారు లాక్కెళ్లారని తెలిపారు. మళ్లీ కొంత సేపటికి ఇలియాస్ తాను మొదట భయపడి అలా చెప్పానని, తన స్నేహితులు, బంధువుల వద్ద రూ.26 లక్షల వరకు అప్పులు చేసి బంగారు కొనుగోలు చేసి తీసుకువచ్చేందుకు బిలాల్‌తో పాటు వెళ్లానని తెలిపారు. దీంతో తాను దుబాయిలో బంగారు కొనుగోలు చేశానని చెప్పాడు. తన వెంట తెచ్చిన బంగారులో 10 తులాలు హైదరాబాదులో విక్రయించి జల్సాకు పాల్పడ్డానని, మిగతా 33 తులాలు బిలాల్ తరపున వచ్చిన వారు లాక్కెళ్లారని తెలిపాడు.

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం

- సీఐ ఇబ్రహీం, కడప టూ టౌన్



ఈ సంఘటనపై సమగ్రంగా విచారిస్తున్నాం. ఎవరు బంగారు కొనుగోలు చేశారు. ఎవరు కడపకు పంపించారు. లేక తీసుకుని వచ్చారు. ఇలియాస్ ఫిబ్రవరి 26న వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఏం జరిగిందనే దానిపై సమగ్రంగా విచారణ నిర్వహిస్తున్నాం. బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

ఖాజీపేట, మార్చి 9: కడప-కర్నూలు జాతీయ రహదారిలోని చెన్నముక్కపల్లె పంచాయతీలో ఆర్టీసీ బస్సు ఢీకొని ఆర్.నాగయ్య (78) మృతి చెందాడు. కొత్తపల్లెకు చెందిన ఆర్.నాగయ్య ఖాజీపేటకు వచ్చి తిరిగి ఇంటికి వెళుతుండగా కడప నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం కడప ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతి చెందినట్లు సీఐ రామాంజులు తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ఒంటిమిట్ట, మార్చి 9: మండల పరిధిలోని పెన్నానది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను శనివారం ఒంటిమిట్ట పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. గత కొద్ది రోజులుగా వైసీపీ నాయకులు అధికారాన్ని అడ్డుపెట్టుకొని విచ్చలవిడిగా ఇసుకను అక్రమ రవాణా చేయడంతో అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. అయినా పట్టించుకోని వైసీపీ నాయకులు నూతనంగా తహశీల్దారుగా బాధ్యతలు చేపట్టిన వెంకటరమణకు ఫిర్యాదులు రావడంతో సిబ్బందితో కలిసి దాడి చేసి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులకు అప్పజెప్పారు. వాహన డ్రైవర్లపై కేసు నమోదు చేసి వాహనాలను కోర్టుకు అప్పజెప్పినట్లు ఎస్ఐ మధుసూధన్‌రావు తెలిపారు.

హుండీ ఆదాయం రూ.9.96 లక్షలు

సిద్దవటం, మార్చి 9: మండలంలోని వంతాటిపల్లె పంచాయతీ నిత్యపూజస్వామి దేవస్థానం హుండీ లెక్కింపు కార్యక్రమం ఉత్సవాల అధికారి రాంప్రసాద్ రెడ్డి, కార్యనిర్వహణ అధికారి మోహన్‌రెడ్డి, చైర్మన్ కొండారెడ్డి ఆధ్వర్యంలో శనివారం జరిగింది. ఈ హుండీ లెక్కింపులో రూ.9,96,750 వచ్చినట్లు ఈవో మోహన్‌రెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

భారీగా తరలుతున్న చెరుకు లోడ్లు



రామాపురం, మార్చి 9: లక్కిరెడ్డిపల్లె అనంతపురం గంగమ్మ జాతర ఈ నెల 11, 12 తేదీల్లో జరగనున్న సందర్భంగా చెరుకు లోడ్లతో వాహనాలు భారీగా జాతరకు తరలి వెళ్తున్నాయి. కడప జిల్లా మైదుకూరు, ఖాజీపేట, చెన్నూరు తదితర ప్రాంతాల నుంచి ట్రాక్టర్ల ద్వారా జాతరకు రెండు రోజులు ముందుగానే తీసుకెళ్తున్నారు. చెరుకులను కట్ట రూ.200 చొప్పున రామాపురం, గువ్వలచెరువు తదితర గ్రామాల్లో విక్రయిస్తున్నారు.

ప్రలోభాలకు తలొగ్గితే మరోసారి నష్టపోవాల్సిందే

● కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి

రాజంపేట, మార్చి 9: రాష్ట్రంలో, దేశంలో జరగబోతున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు బీజేపీ ప్రలోభాలకు తలొగ్గితే మరోసారి రాష్ట్రం, దేశం భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పూల భాస్కర్ తెలిపారు. శనివారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంపై ఎన్నడూ లేని విధంగా బీజేపీ తిరుమల వెంకన్న సాక్షిగా ప్రత్యేక హోదా ఇస్తానని గతంలో చెప్పినా, ఇంత వరకు దాని ఊసేలేదన్నారు. దేశంలో మరోసారి అధికారంలోకి రావాలని ప్రధాని మోదీ అనేక జిమ్మిక్కులకు పాల్పడుతున్నారన్నారు. దేశ ప్రజలు ఇప్పటికే బీజేపీతో విసిగిపోయారని, కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో మక్కువ ఏర్పడిందని అభివృద్ధి జరగాలన్నా కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. మహిళల కోసం ఇందిరమ్మ అభయం ప్రతిపేద కుటుంబానికి రూ.5 వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో, దేశంలో కాంగ్రెస్ విజయకేతనం ఎగురవేస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదాపై తొలిసంతకం రాహుల్‌గాంధీ చేస్తారని ఆయన జోస్యం పలికారు. కాంగ్రెస్ పార్టీకి రానున్న ఎన్నికల్లో ప్రజలు బ్రహ్మరథం పడతారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

కన్నుల పండువగా చింతోళ్లమాలి తిరుణాల

చిన్నమండెం, మార్చి 9: మండలంలోని దేవగుడిపల్లె గ్రామపంచాయతీ ఇలవేల్పు దేవుడైన చింతోళ్లమాలి శ్రీ పెద్దయ్యస్వామి తిరుణాల కన్నులపండువగా సాగింది. శుక్రవారం రాత్రి శివుడి (దేవరెద్దు) తోబుట్టువైన సెలగోలమ్మ దేవగుడిపల్లె నుంచి జల్లవాళ్లపల్లెకు చేరుకుంది. అక్కడి నుంచి సెలగోలమ్మ, దేవరెద్దు జల్లవాళ్లపల్లె బాహూజీ నగర్ కాలనీ మీదుగా శనివారం తెల్లవారుజామున దేవగుడిపల్లెలోని దేవర ఇంటికి చేరుకుంది. అక్కడ పూజల అనంతరం కురవపల్లె మీదుగా చింతోళ్లమాలికి చేరుకోవడంతో తిరుణాల ప్రారంభమైంది. వచ్చిన భక్తులు దేవరెద్దుకు మొక్కులు చెల్లించుకుని పూజలు చేశారు. సాయంత్రం 5 గంటల సమయంలో బండారుకురాడు కార్యక్రమానికి పెద్దఎత్తున భక్తులు హాజరై ఈ కార్యక్రమాన్ని వీక్షించారు. కాగా టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి రాంప్రసాద్‌రెడ్డి కుటుంబ సమేతంగా విచ్చేసి దేవరెద్దుకు ప్రత్యేక పూజల అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తమ కుటుంబానికి చింతోళ్లమాలి అంటే ఎనలేని అభిమానమని, ప్రతి ఏడాది ఈ కార్యక్రమానికి హాజరై మొక్కులు చెల్లించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులతో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరయ్యారు.

వేడుకగా సిద్దులయ్య జాగారం

రైల్వేకోడూరు, మార్చి 9: మండలంలోని వీవీఆర్ కండ్రిక గ్రామంలో వెలసిన శివాలయంలో శనివారం సిద్దులయ్య జాగారం శనివారం వైభవంగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. మహాశివరాత్రి మరుసటి రోజున ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. బండ్ల పోటీలు, పొంగుబాళ్ల కార్యక్రమాలు నిర్వహించారు.

తొలగించిన చోటే విగ్రహం ఏర్పాటు చేస్తాం

● ప్రజాసంఘాలకు హామీ ఇచ్చిన రాంప్రసాద్ రెడ్డి

రాయచోటిటౌన్, మార్చి 9: టీడీపీ అధికారంలోకి వచ్చిన నెలలోపే అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించిన స్థానంలోనే తిరిగి ఏర్పాటు చేస్తామని రాయచోటి టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి ప్రజాసంఘాలకు హామీ ఇచ్చారు. శనివారం రాయచోటి పట్టణంలోని తహసీల్దారు కార్యాలయానికి సమీపంలో గల అంబేద్కర్ ఫ్లెక్సీ వద్ద ప్రజాసంఘాలు ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో రాంప్రసాద్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రజాసంఘాలు సంవత్సర క్రితం రాయచోటి తహసీల్దారు కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసుకున్న అంబేద్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి తొలగించినందుకు నిరసనగా ఈ రౌండ్‌టేబుల్ సమావేశం జరిపారు. ఈ సమావేశానికి గిరిజన సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి విశ్వనాథ నాయక్ అధ్యక్షత వహించారు. రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఎక్కడ చూసినా ఎవరెవరివో విగ్రహాలు పెడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించడం సిగ్గుచేటన్నారు. విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతోపాటు కలెక్టరేట్ ఎదురుగా ప్రజాసంఘాలకు ప్రత్యేకంగా ధర్నా చౌక్ ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈశ్వర్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థలన్నింటినీ పక్కనపెట్టి స్వంతంగా వ్యవస్థలను ఏర్పాటు చేసుకుని ప్రజల హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఖాదర్‌బాషా మాట్లాడుతూ మోసగాళ్లకు మారుపేరుగా ఎమ్మెల్యే ఉన్నారని ఆరోపించారు. అనంతరం భారతీయ అంబేద్కర్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లం తాతయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకలు రామాంజనేయులు, ఇతర ప్రజాసంఘాలు ముక్తకంఠంతో ఆరోపించాయి. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామాంజులు, ఏఐటీయూసీ సాంబ, పౌరహక్కుల సంఘం న్యాయవాది రవి శంకర్, బీసీ న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగముని, సీపీఐ (ఎంఎల్) మావులూరి విశ్వనాథ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కోటేశ్వర్‌రావు, వడ్డెర విద్యావంతుల వేదిక మారుతి, ఎమ్మార్పీఎస్ నాయకులు, గిరిజన సమాఖ్య, దళిత బహుజన ఫ్రంట్ రెడ్డన్న, కేవీవీపీ జిల్లా అధ్యక్షుడు బీసీ వెంకటయ్య పాల్గొన్నారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న రాంప్రసాద్‌రెడ్డి

టీడీపీలో చేరిన ముస్లింలు

రాయచోటి టీడీపీ అభ్యర్థి రాంప్రసాద్‌రెడ్డి పట్టణంలో ప్రధానంగా వున్న ముస్లిం పెద్దలను, ప్రముఖులను కలుస్తూ ఆత్మీయంగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే పట్టణంలోని జామీయా ఫ్రూట్ మార్కెట్‌లోని మండీ వ్యాపారులతో మర్యాదపూర్వకంగా కలసి ఎన్నికల్లో తనకు మద్దతివ్వాలని అభ్యర్థించారు. అనంతరం రాంప్రసాద్‌రెడ్డి సమక్షంలో మండీ వ్యాపారులు టీడీపీ కండువాలు కప్పుకొన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఖాదర్‌బాషా, జాఫర్‌వల్లి, మనోహర్‌రెడ్డి, ఇస్మాయిల్, జుల్‌ఫక్రుద్దీన్, బిలాల్, చిన్న మగ్బుల్, సమీవుల్లా, షకీల్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణోత్సవం







హత్యరాలలో జరిగిన శివపార్వతుల కల్యాణానికి హాజరైన భక్తులు, అలంకరణలో స్వామి, అమ్మవార్లు, రామాపురంలో ప్రత్యేక అలంకరణలో శివుడు

రాజంపేటటౌన్, మార్చి 9: రాజంపేట మండల పరిధిలోని హత్యరాల పుణ్యక్షేత్రంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేదపండితులు సంప్రదాయ పద్ధతిలో స్వామివారి కల్యాణ తంతు నిర్వహించారు. రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి, ఆలయ చైర్మన్ వెలగచర్ల వెంకటసుబ్బారెడ్డి, వైసీపీ నాయకులతో పాటు పలువురు ముఖ్యనేతలు స్వామి వారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు.

నేడు రథోత్సవం: హత్యరాల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 10 గంటలకు కామాక్షి సమేత త్రేతేశ్వరస్వామి వార్లకు ఘనంగా రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. పెద్దఎత్తున భక్తులు హాజరు కావాలని, రథోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించాలని కోరారు.

రామాపురం: మండలంలోని హసనాపురం సమీపంలో వెలసిన శివాలయంలో శుక్రవారం అర్ధరాత్రి 12 నుంచి తెల్లవారుజామున 5.30 గంటల వరకు మహన్యాస లింగోద్భవ కాలంలో ఏకాదశ రుద్రాభిషేక పూజలు జరిగాయి. బెంగళూరుకు చెందిన వేద పండితులు లక్ష్మీకాంత్ ఆధ్వర్యంలో పప్పిరెడ్డి మహేశ్వర్‌రెడ్డి దంపతులు, ఆలయ చైర్మన్ సత్యమ్మ వెంకటరెడ్డి దంపతులు ఘనంగా నిర్వహించారు. అనంతరం శివపార్వతుల గ్రామోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇరుగులమ్మ చైర్మన్ చిన్నరెడ్డన్న, మాజీ చైర్మన్ చలమారెడ్డి, కంకర యజమానులు రాజారెడ్డి, నరసింహారెడ్డి, హరినాథరెడ్డి, గ్రామ సర్పంచ్ ఆంజనేయులు, అజీమ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

జాతరలో మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు : సీఐ



ఆలయం వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న పోలీసులు

లక్కిరెడ్డిపల్లె, మార్చి 9: గంగమ్మ జాతరలో మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని లక్కిరెడ్డిపల్లె సీఐ జీవన్ గంగనాథ్‌బాబు హెచ్చరించారు. ఎస్ఐ విష్ణువర్ధన్‌తో కలిసి శనివారం ఆయన జాతర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మవారికి చాందినీ బండ్లు మొక్కుబడి ఉన్నవారు నిబంధనల మేరకు ఎత్తు తగ్గించి కట్టుకోవాలని, ముందుగానే పోలీసుల అనుమతులు తీసుకోవాలన్నారు. గంగమ్మ జాతరలో అశ్లీల నృత్య ప్రదర్శనలు, రికార్డు డ్యాన్సులు, మైకులు, సౌండు బాక్సు వంటివి ఏర్పాటు చేసి భక్తులను ఇబ్బందులకు గురి చేయకూడదన్నారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. జాతరలో 16 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, దొంగతనాలు, మద్యం విక్రయాలు, పేకాట వంటి వాటిపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఎక్కడిక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, వాహనదారులు పోలీసులకు సహకరించాలన్నారు. ఆలయం ముందు భాగం నుంచి బారికేడ్లను ఏర్పాటు చేసి భక్తులకు ఇబ్బంది లేకుండా చేయాలని ఆలయ చైర్మన్ రెడ్డయ్య, మండల ఉపాధ్యక్షుడు సమరసింహారెడ్డి, రవీంద్ర రాజులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీ రాంప్రసాద్, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఈ ఏడాదైనా అధిక రేట్లు అరికట్టేనా..?

అనంతపురం గంగమ్మ జాతరకు లక్షల సంఖ్యలో భక్తులు దూర ప్రాంతాల నుంచి వాహనాల్లో రానున్నారు. అయితే ప్రతి ఏటా జాతరలో భక్తుల నుంచి అధిక రేట్లు వసూలు చేసి వారిని లూటీ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దేవదాయ ధర్మాదాయ శాఖ నిబంధనల మేరకు కొబ్బరికాయ రూ.30కు విక్రయించాలి. వేలం పాటలు దక్కించుకున్న వారు రూ.50కు పైగానే భక్తుల నుంచి వసూలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇది ప్రతి ఏటా ఆనవాయితీగా మారిందని, దేవదాయ ధర్మాదాయ శాఖ వారు ఇలాంటి అక్రమ విక్రయాలను అరికట్టలేరా అంటూ భక్తులు ప్రశ్నిస్తున్నారు. అంతేకాకుండా వందల సంఖ్యలో లారీలు, ట్రాక్టర్లలో బెల్లపు సరుకులు వస్తాయని, దేవదాయశాఖ వారి నిబంధన ప్రకారం బెల్లపు చెరుకులు లారీకి టోల్‌గేట్ రూ.1500లు, ట్రాక్టర్‌కు రూ.1000లు, జీపు, కార్లు, ఎద్దుల బండ్లకు రూ.100లు వసూలు చేయాలి. కానీ టోల్‌గేట్, కొబ్బరికాయల వేలం పాట దక్కించుకున్న వారు భక్తుల నుంచి అధిక మొత్తం వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. జాతరకు వచ్చే చిరు వ్యాపారులు, పెద్ద హోటల్‌కు రూ.వెయ్యి, చిన్న హోటల్‌కు రూ.500 వసూలు చేయాలి. అంతేకాకుండా జెయింట్‌వీల్, రంగుల రాట్నంలో ఒక్కో పిల్లాడికి రూ.100లు వసూలు చేస్తున్నారు. అధిక ధరల కారణంగా అమ్మవారి దగ్గర బెల్లపు సరుకులు కూడా కొనలేని స్థితిలో చాలా మంది భక్తులు వెనుదిరుగుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇన్ని జరుగుతున్నా దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదనే విమర్శలు గుప్పుమంటున్నాయి. ఈ విషయమై ఈవో రవీంద్రరాజును వివరణ కోరగా అధిక ధరలకు విక్రయించే వారి టెండర్లు రద్దు చేస్తామని, ఈ ఏడాది అలాంటివి జరగకుండా చూస్తామన్నారు.

రూ.50 వేల విరాళం

లక్కిరెడ్డిపల్లె, మార్చి 9: రాయలసీమకే తలమానికంగా పేరుగాంచిన లక్కిరెడ్డిపల్లె అనంతపురం గంగమ్మ జాతరకు వచ్చే భక్తుల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేయనున్న తాగునీరు, మజ్జిగ కొరకు రాయచోటి పట్టణంలోని మురళి సైనిక్ అండ్ నవోదయ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు శనివారం రూ.50 వేలను విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని పీఆర్‌టీయూ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్, ఓపెన్ స్కూల్స్ జిల్లా కో-ఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజు చేతుల మీదుగా లక్కిరెడ్డిపల్లె మానవత, అయ్యప్ప సేవాసమితి, గంగమ్మ ఆలయ సమితి సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మురళి కోచింగ్ సెంటర్ డైరెక్టర్ కొండూరు మురళీమోహన్‌రాజు, పీఆర్‌టీయూ నేతలు వేణుగోపాలరావు, శ్రీనివాసులు, శివశంకర్ రెడ్డి, రవి, రామచంద్ర, నలంద స్వామి, గంగరాజు, నరసింహరాజు, గంగమ్మ ఆలయ చైర్మన్ రెడ్డయ్య, ఆలయ ఈవో రవీంద్ర రాజు, శివయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆలయ నిర్వాహకులకు నగదు విరాళంగా అందజేస్తున్న దృశ్యం

బీజేపీ ఆధ్వర్యంలో అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

ఒంటిమిట్ట, మార్చి 9: మండల బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని స్థానిక బస్టాండు ఆవరణంలో పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా ప్రధాని మోదీ నాయకత్వాన్ని దేశ ప్రజలందరూ కోరుకుంటున్నారని, ప్రతి పేదవాడు సంతోషంగా ఉండాలంటే బీజేపీ అధికారంలో ఉండాలని బీజేపీ నాయకులు అన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం తపించే పార్టీగా బీజేపీ దేశంలో కొనసాగుతుందని మరోమారు ప్రధానిగా నరేంద్రమోదీ కావడం తథ్యమన్నారు. పేదవాళ్లను ఆదుకునేందుకు గరీబ్ కళ్యాణ్, ఆవాస్ యోజన వంటి పథకాలను పేద ప్రజల కోసం తీసుకొచ్చి పేదల ఇంట్లో ఆనందాన్ని చూడటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు శివరాజు, బీజేపీ నాయకులు పాటూరు గంగిరెడ్డి, సిగి భాస్కర్‌రెడ్డి, వేణుగోపాల్‌రాజు, గురాజీవర్మ, పేరూరు కొండయ్య, పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పోలీసు నిబంధనలను పాటించాలి: ఎస్ఐ

గుర్రంకొండ, మార్చి 9: మండలంలోని అన్ని పార్టీల నాయకులు పోలీసుల నిబంధనలను పాటించాలని ఎస్ఐ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. శనివారం విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పట్టణంలో పోలీస్ యాక్ట్ అమలులో ఉందన్నారు. కావున సమావేశాలు, ర్యాలీ, దర్నాలు చేయరాదని, ఒకవేళ నిర్వహించాలంటే పోలీసుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

కేంద్ర బలగాలతో పోలీసు కవాతు



కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్న డీఎస్పీ, పోలీసు సిబ్బంది

పెనగలూరు, మార్చి 9: మండలంలో శనివారం సాయంత్రం డీఎస్పీ చైతన్య ఆధ్వర్యంలో కేంద్ర ఎస్ఎస్‌బీ కేంద్ర బలగాలు మూడు కి.మీ. దూరం కవాతు నిర్వహించాయి. సింగనమల నుంచి కంబాలకుంట బీసీ కాలనీ, మండల కేంద్రంతో పాటు పెనగలూరు గ్రామాలలో తుపాకులు చేతపట్టి కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రానున్న సాధారణ ఎన్నికల్లో ప్రజలకు రక్షణగా పోలీసులు ఉంటారని, ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అవగాహన కోసమే ఈ కార్యక్రమం తలపెట్టినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజంపేట రూరల్ సీఐ మంజునాధరెడ్డి, టౌన్ సీఐ మద్దెయ్య ఆచారి, పెనగలూరు ఎస్ఐ సుబాష్ చంద్రబోస్ పాల్గొన్నారు.

అనారోగ్య బాధితునికి ఆర్థిక సాయం



బాధితుడికి ఆర్థికసాయం చేస్తున్న సాయివికాస్‌రెడ్డి

ఓబులవారిపల్లె, మార్చి 9: అనారోగ్యంతో బాధపడుతున్న కోటపాటి రమణయ్య కుటుంబానికి ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ అధినేత, రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి తనయుడు సాయివికాస్‌రెడ్డి రూ.20 వేలు ఆర్థిక సాయం చేశారు. మండలంలోని చిన్నంపల్లె గ్రామ పంచాయతీ లింగిరెడ్డిపల్లె ఎస్టీ కాలనీలో నివాసం ఉంటున్న రమణయ్య గత కొంతకాలంగా అనారోగ్యం కారణంగా ఆర్థిక సమస్యలతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న సాయివికాస్‌రెడ్డి శనివారం పై సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గుండు శివారెడ్డి, గణపతి రాజు, సల్లా వెంకటసుబ్బారెడ్డి, చవకుల శంకరయ్య, గుండు గురవారెడ్డి, నారపరెడ్డి రాజారెడ్డి, బత్తిన వేణుగోపాలరెడ్డి, గుండు పెంచలరెడ్డి, సుబ్బరాయుడు, శ్రీనివాసులు ముక్కావారిపల్లె సర్పంచ్ అరవ శ్రీధర్ పాల్గొన్నారు.

చిన్నారులకు విద్యాసామగ్రి పంపిణీ



విద్యాసామగ్రి అందజేస్తున్న దృశ్యం

రాజంపేటటౌన్, మార్చి 9: కాస్కో సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని బాలసదన్ చిన్నారులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, రబ్బర్లు, తినుబండారాలు, శీతల పానీయాలు, శనివారం పంచిపెట్టారు. సందర్భంగా సభ్యులు జవ్వాజి సాయిసందీప్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఆర్థిక రంగంలో ముందుకు పరిగెడుతున్న సంస్థ తమ అభివృద్ధి మాత్రమే కాక పేదల అభ్యున్నతి కూడా ధ్యేయంగా ముందుకు సాగుతోందని తెలిపారు. అనాథ శరణాయాలకు తోచినంత సాయం చేయడంతో పాటు పేద విద్యార్థుల విద్యా ప్రగతి కోసం నిరంతరం పాటు పడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు నాగార్జున, మణి, వెంకటేష్, తేజ, ప్రశాంత్, పెంచలయ్య, సుకుమార్, సురేష్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

'విధ్వంస పాలనను తరిమికొడదాం'



కమ్మపల్లెలో ప్రచారం చేస్తున్న హరితరెడ్డి

చిన్నమండెం, మార్చి 9: మండలంలోని పడమటికోన, కమ్మపల్లె, అయ్యగారిపల్లెల్లో శనివారం రాత్రి రాయచోటి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి సతీమణి హరితరెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి బాలసుబ్రహ్మణ్యం, ఎమ్మెల్యే అభ్యర్థిగా రాంప్రసాద్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. విధ్వంసంతో ప్రారంభమైన వైసీపీ పాలనకు తమ ఓటుతో బుద్ధి చెప్పాలని ప్రజలను ఆమె కోరారు. ఈ ఎన్నికల్లో వైసీపీ గెలిస్తే గ్రామాల్లోని భూములను సైతం ఆ పార్టీ నాయకులు లాగేసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో రామ్మూర్తిస్వామి, బాలశెట్టి, పేరం నాయుడు, సుదర్శన్‌రెడ్డి, సుబ్బారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తాం



రూపానందరెడ్డిని కలిసి సన్మానిస్తున్న సుదర్శన్‌నాయుడు, తదితరులు

పెనగలూరు, మార్చి 9: మరో నెల రోజుల్లో జరగనున్న సాధారణ ఎన్నికల్లో రైల్వేకోడూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయం కోసం నియోజకవర్గ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి వెంట నడుస్తామని టీడీపీ తెలుగు యువత జిల్లా కార్యదర్శి కొర్రపాటి సుదర్శన్‌నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ముక్కావారిపల్లెలో ఆయనను కలిసి సన్మానించారు. అభ్యర్థి ఎవరైనా టీడీపీ, జనసేన విజయమే తమ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట దాసరి సురేష్‌నాయుడు, అన్నంకి హరీష్‌చంద్రనాయుడు, ఆరే శివకుమార్‌నాయుడు ఉన్నట్లు తెలిపారు.

వైభవంగా వీరభద్రుని కల్యాణం

చిట్వేలి, మార్చి 9: పాత చిట్వేలిలో వెలసియున్న భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయంలో రెండవ రోజు శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మేరకు భద్రకాళి వీరభద్రునికి కల్యాణాన్ని అత్యంత కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం భక్తులకు పసుపు, కుంకుమ, గాజులు, పసుపు దారం భక్తులకు అందించారు. వేలాది మందికి గొప్ప అన్నదాన కార్యక్రమం నిర్వహించి తీర్థప్రసాదాలు అందించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు మృత్యుంజయశర్మ, నిర్వాహకులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం



అన్నదానం ఏర్పాటు చేసిన దృశ్యం

నందలూరు,మార్చి 9: రాజంపేట మండలంలోని బాహుదానది ఒడ్డున హత్యరాల గ్రామంలో వెలసిన శ్రీ కామాక్షి సమేత త్రేతేశ్వరస్వామి దేవాలయం వద్ద మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులకు స్థానిక జడ్పీటీసీ గడికోట ఉషారాణి, గడికోట వెంకటసుబ్బారెడ్డి దంపతులు శనివారం పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రోసిరెడ్డి, లేబాక సుబ్బారెడ్డి, రామసుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి, గుర్రంపేట వెంకటసుబ్బారెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేసి భక్తులకు భోజనాలు వడ్డించారు.

వరి పంటను తొక్కేసిన ఏనుగుల గుంపు


చుక్కావారిపల్లెలో ఏనుగులు నాశనం చేసిన వరిపంట

ఐరాల, మార్చి 9: ఐరాల మండలం చుక్కావారిపల్లెలోని పొలాలపై శనివారం వేకువజామున ఏనుగుల గుంపుఒకటి పడింది. గ్రామానికి చెందిన బాలాజి, దొరస్వామి, జనార్దన్‌లకు చెందిన వరి పంటను తొక్కి, నాశనం చేశాయి. ఈ ఏనుగుల గుంపు గ్రామానికి సమీపంలోని అటవీ ప్రాంతంలో మాటు వేశాయని రైతులు తెలిపారు. అవి తిరిగి పంటలపై దాడులు చేస్తాయని భయపడుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి అటవీ ప్రాంతంలో సోలార్ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేసి ఆదుకోవాలని కోరుకుంటున్నారు.

పోలీసుల అదుపులో ద్విచక్ర వాహనాల దొంగల ముఠా

నాయకుడిగా ఏఆర్ కానిస్టేబుల్?

రామకుప్పం, మార్చి 9: కుప్పం నియోజకవర్గంలో ద్విచక్రవాహనాల దొంగతనానికి పాల్పడుతున్న ముఠాను రామకుప్పం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇటీవల రామకుప్పం మండలం తిమ్మసముద్రం వద్ద ఓ యువకుడు ద్విచక్రవాహనంలో కర్ణాటక సరిహద్దు గ్రామం నుంచి మద్యాన్ని తీసుకొస్తుండగా ఈ ముఠా గమనించింది. అతడిని ఆపి తాము ఎక్సైజ్ పోలీసులమంటూ కర్ణాటక మద్యంతోపాటు ద్విచక్ర వాహనాన్ని తీసుకెళ్లిపోయారు. దీనిపై ఆ యువకుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కుప్పం మండలానికి చెందిన ఓ ఏఆర్ కానిస్టేబుల్ నేతృత్వంలో కొందరు ముఠాగా ఏర్పడి ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడుతున్నట్లు దర్యాప్తులో తేలింది. దీంతో ఆ కానిస్టేబుల్‌తోపాటు మరికొందరిని శనివారం అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు తెలిసింది. ఈవిషయమై ఎస్‌ఐ శివకుమార్‌ను వివరణ కోరగా.. ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడుతున్నట్టు అనుమానంపై కొంతమందిని విచారిస్తున్నామని చెప్పారు. పూర్తి వివరాలు ఆదివారం మీడియా సమావేశంలో వెల్లడిస్తామని తెలిపారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.36 కోట్లు

తిరుమల, మార్చి9(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.36 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి శనివారం ఉదయం ప్రకటించింది. ఇక, శుక్రవారం 63,831 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 25,367 మంది తలనీలాలు సమర్పించారు.

టీడీపీ, జనసేన నేతలకు

బైండోవర్ పేరుతో బెదిరింపులు

రాష్ట్ర ఎన్నికల కమిషన్, డీజీపీకి టీడీపీ నేతల లేఖ


మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, మార్చి 9: బైండోవర్ పేరుతో టీడీపీ, జనసేన నేతలను పోలీసులతో బెదిరిస్తున్నారని తెలుగుదేశం పార్టీ నేతలు ఆరోపించారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషన్, డీజీపీకి లేఖ ద్వారా విన్నవించారు. శనివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో నాయకులు మీడియాతో మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అధికార పార్టీ నేతలు కావాలనే టీడీపీ, జనసేన నేతలను బైండోవర్ పేరుతో పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి పోలీసులతో బెదిరిస్తున్నారని చెప్పారు. నేర చరిత్ర కలిగిన రౌడీలు, గూండాలను ఎన్నికల ముందు స్టేషన్లకు పిలిపించి బైండోవర్ చేయడం సాధారణ విషయమని అన్నారు. అయితే పోలీసులు కేవలం టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలపై కేసులు నమోదు చేయడం దారుణమని చెప్పారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుతో బాలిక మృతి


యశ్వంతి మృతదేహం

పలమనేరు, మార్చి 9: పాము కాటుతో ఓ బాలిక మృతి చెందింది. కుటుంబీకులు తెలిపిన వివరాల మేరకు.. పెద్దపంజాణి మండలం కెలవాతి గ్రామానికి చెందిన రెడ్డెప్ప, హిమబిందు దంపతులకు ఇద్దరు కుమార్తెలు. శుక్రవారం రాత్రి భోజనానంతరం రెడ్డెప్ప ఆరుబయట, హిమబిందు ఇంట్లో మంచంపై చిన్నకుమార్తెతో నిద్రించారు. పెద్ద కుమార్తె యశ్వంతి(10) ఇంటి లోపల నేలపై నాన్నమ్మతో కలిసి పడుకుంది. శనివారం తెల్లవారుజామున సుమారు రెండు గంటల ప్రాంతంలో ఇంటి తలుపునకు ఉన్న సన్నటి రంధ్రం నుంచి కట్లపాము ఒకటి లోపలకు చొరపడింది. యశ్వంతి నానమ్మ మెడపై పాకడంతో ఆమె నిద్రలేచి చేతితో ఆ పామును పట్టుకుని విసిరేసి కేకలు పెట్టారు. నిద్రలేచిన రెడ్డెప్ప వెంటనే ఇంట్లోకొచ్చి ఆ పామును కొట్టి చంపేశాడు. తర్వాత అందరూ నిద్రకు ఉపక్రమించారు. అయితే యశ్వంతి తనకు తలనొప్పిగా ఉందని, వాంతి వస్తోందని చెప్పింది. అర్ధరాత్రి నిద్రలేవడంతో పైత్యం చేసి ఉంటుందని, నిద్రపోతే తగ్గిపోతుందని తల్లిదండ్రులు చెప్పడంతో ఆ బాలిక మిన్నకుండి పోయింది. మళ్లీ కొద్దిసేపటికే తనకు తలనొప్పి ఎక్కువగా ఉందని చెప్పడంతో తల్లిదండ్రులకు పాము కాటేసిందన్న అనుమానం వచ్చి తమ సమీప బంధువు కారులో కుమార్తెను శివాడిలో ఉన్న ఒక ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పాముకాటు విరుగుడుకు కొన్ని ఇంజక్షన్లు వేశారు. అయినా బాలిక కోలుకోక పోవడంతో ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. దాంతో తెల్లవారు జామున 4.10 గంటలకు పలమనేరు ప్రభుత్వాస్పత్రికి చేరుకున్నారు. అక్కడ బాలిక చికిత్స పొందుతూ 4.25 నిమిషాలకు మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. ఈ ఘటనపై ఆస్పత్రి వర్గాలు పలమనేరు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

నేటి శంఖారావం వాయిదా

చిత్తూరు సిటీ/వెదురుకుప్పం, మార్చి 9: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శంఖారావం పేరుతో సభలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ మేరకు ఆదివారం జిల్లాలో నిర్వహించేందుకు వారం ముందు షెడ్యూల్ విడుదల చేశారు. దీనికోసం సభా స్థలాలను స్థానిక నాయకులు పరిశీలించారు. ఎస్‌ఆర్‌పురం మండలం, చిత్తూరు, యాదమరి ప్రాంతాల్లో ఆదివారం శంఖారావం నిర్వహించాల్సి ఉంది. కానీ, ఆదివారం ఉరవకొండ అసెంబ్లీ నియోజకవర్గంలో శంఖారావం నిర్వహిస్తుండటంతో జిల్లాలో వాయిదా పడింది.

వైసీపీ కరపత్రాలతో వలంటీర్ల ప్రచారం

అడ్డుకున్న పెద్ద బంగారునత్తం గ్రామస్తులు

కుప్పం, మార్చి 9: రాత్రి సమయంలో వైసీపీ కరపత్రాలు పంచుతూ ప్రచారం చేస్తున్న వలంటీర్లను పెద్ద బంగారునత్తం గ్రామస్తులు అడ్డుకున్నారు. శనివారం రాత్రి 7.30 గంటల సమయంలో అధికార పార్టీ కార్యకర్తలతోపాటు గ్రామంలో తిరుగుతూ కరపత్రాలు పంచుతున్న ఇద్దరు మహిళా వలంటీర్లను గ్రామస్తులు గుర్తించారు. వలంటీర్లతో ప్రచారం చేయకూడదని ఎన్నికల కమిషన్ నిబంధన విధించినా ఇలా ఎందుకు చేస్తున్నారని నిలదీశారు. వలంటీర్లు తమ చేతిలో ఉన్న బయోమెట్రిక్ పరికరాన్ని చూపిస్తూ.. తాము లబ్ధిదారుల నుంచి వేలిముద్రలు సేకరించడానికి వచ్చామని సర్దిచెప్పబోయారు. అయితే గ్రామస్తులు గట్టిగా నిలదీయడంతో వలంటీర్లు ప్రచారం చాలించి వెనుదిరిగారు. ఈ మొత్తం సంఘటనను గ్రామస్తులు వీడియో తీసి.. సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు.

డీసీవోగా నాగవర్ధన

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 9: తిరుపతి జిల్లా సహకార ఆడిట్ అధికారిగా పనిచేస్తున్న నాగవర్ధనను స్పెషల్ కేడర్ డిప్యూటీ రిజిస్ట్రార్‌గా పదోన్నతి కల్పించి చిత్తూరుజిల్లా సహకార అధికారి (డీసీవో)గా నియమించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సహకారశాఖలో వివిధ హోదాల్లో పనిచేసిన ఆమె సోమవారం ప్రస్తుత ఇన్‌చార్జి డీసీవో బ్రహ్మానంద రెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరిస్తారు.

రేపు కలెక్టరేట్‌లో 'స్పందన' రద్దు

చిత్తూరు, మార్చి 9: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమాన్ని అనివార్య కారణాల రీత్యా రద్దు చేసినట్లు కలెక్టర్ షన్మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మార్పును అర్జీదారులు గమనించి.. వ్యయప్రయాసల కోర్చి జిల్లా కేంద్రానికి రావద్దని ఆయన సూచించారు.

ఇంటర్ ఫస్టియర్ పరీక్షలకు 732 మంది గైర్హాజరు

చిత్తూరు (సెంట్రల్), మార్చి 9: ఇంటర్మీడియట్ పరీక్షల్లో భాగంగా శనివారం జరిగిన ఫస్టియర్ మ్యాథ్స్ 1బీ, బోటనీ, హిస్టరీ పేపర్ 1 పరీక్షల్లో భాగంగా 12,321 మంది హాజరైనట్లు డీవీఈవో సయ్యద్ మౌల పేర్కొన్నారు. మొత్తం 13054 మందికిగాను 12,321 మంది హాజరవగా, 732 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. డీవీఈవో నాలుగు సెంటర్లు, జిల్లా పరీక్షల కమిటీ తొమ్మిది, స్క్వాడ్ 10 సెంటర్లు పరిశీలించినట్లు వివరించారు. సోమవారం ఇంటర్ సెకండియర్ మ్యాథ్స్ 2బీ, బోటనీ, హిస్టరీ పేపర్ 2 పరీక్షలు జరగనున్నాయి.

9 సహాయ పోలింగ్ కేంద్రాలు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 9: 1450కు మించి ఓటర్లున్న పోలింగ్ కేంద్రాల్లో కుప్పం మినహా మిగిలిన ఆరు నియోజకవర్గాల్లో తొమ్మిది సహాయక పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదన పంపింది. ప్రస్తుతం జిల్లాలో 1,762 పోలింగ్ కేంద్రాలను అధికారులు గుర్తించారు. వీటిలో 415 సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు తేలింది. ఇక్కడ అదనపు పోలీసు బలగాలను ఏర్పాటు చేసే అవకాశం ఉంది. కాగా.. ఎన్నికల షెడ్యూల్ ఈనెల మూడో వారంలో వెలువడనున్న దృష్ట్యా సోమవారం కలెక్టరేట్‌లోని డీఆర్డీఏ మీటింగ్ హాలులో నోడల్ ఆఫీసర్లు, సంబంధిత అధికారులతో సమావేశం జరుగుతుంది.

ముక్కంటిక్షేత్రం.... జనసంద్రం



శ్రీకాళహస్తి, మార్చి 9:వాయులింగేశ్వరుడి రథోత్సవాన్ని తిలకించడానికి తరలివచ్చిన వేలాదిమంది భక్తులతో శ్రీకాళహస్తి జనసంద్రమే అయింది.ఓం నమఃశివాయ... హర హర మహాదేవ శంభోశంకరా... అంటూ చతుర్మాడ వీధులు మార్మోగాయి.శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం జరిగిన రథోత్సవాన్ని తిలకించడానికి తరలివచ్చిన భక్తులతో ఉదయం 9 గంటల నుంచే తేరువీధి, నెహ్రూవీధి, నగరి వీధి, బజారు వీధి నిండిపోయాయి.పార్వతీ పరమేశ్వరులు అలంకార మండపం నుంచి బిక్షాల గాలిగోపురం ముందు భాగాన ఉన్న రథాల వద్దకు చేరుకున్నారు. స్వామివారిని పెద్ద రథంలో అధిరోహింపజేసిన అర్చకులు హారతులు సమర్పించి ఉత్సవానికి శ్రీకారం పలికారు. రథానికి ఉన్న మోకులను వందలాదిమంది. భక్తులు ముందుకు లాగారు తేరువీధి, నెహ్రూవీధి మీదుగా స్వామివారి రథాన్ని బేరివారి మండపం సమీపంలోని నవ సంధి గణపయ్య వరకు మొదట లాగారు.ఆ తరువాత అమ్మవారి రథాన్ని ముందుకు కదిలించారు. జ్ఞాన ప్రసూనాంబ రథాన్ని పెండ్లిమండపం వరకు తరువాత స్వామివారి రథాన్ని బిక్షాల గాలిగోపురం వరకు తీసుకెళ్లారు. అనంతరం అమ్మవారి రథాన్ని నగరి వీధి మీదుగా బిక్షాల గాలిగోపురం వరకు తీసుకొచ్చి యథా స్థానాల్లో చేర్చారు. అనంతరం ఉత్సవర్లకు హారతులు సమర్పించి ఆలయంలోకి తీసుకెళ్లారు.రథాలు కదులుతున్న సమయంలో ఉప్పు, మిరియాలు చల్లుతూ భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన రెడ్డి, ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు, పాలక మండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, ఆలయ అధికారులు, పలుశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు శివపార్వతుల కల్యాణం

మహాశివరాత్రి ఉత్సవాల్లో ఆదివారం రాత్రి శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నారు. రాత్రి 9 గంటల తరువాత గజవాహనంపై శ్రీకాళహస్తీశ్వరుడు, సింహ వాహనంపై జ్ఞానప్రసూనాంబదేవి పెండ్లిమండపం వద్దకు చేరుకుంటారు. సోమవారం వేకువ జామున స్వామి వారి కల్యాణం నిర్వహిస్తారు. కళ్యాణోత్సవానికి ఆదివారం ఉదయం కాణిపాక ఆలయం, సాయంత్రం టీటీడీ ఆధ్వర్యంలో పట్టువస్త్రాలను సమర్పించనున్నారు.

నేత్రపర్వంగా తెప్పోత్సవం





శివరాత్రి ఉత్సవాల్లో శనివారం రాత్రి నారద పుష్కరిణిలో శివపార్వతుల తెప్పోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ఉత్సవ మూర్తులను చప్పరాలపై అధిష్టింపజేసి మంగళ వాయిద్యాలు, మేళతాళాల మధ్య బాబు అగ్రహారంలోని నారద పుష్కరిణి వద్దకు తీసుకువచ్చారు. వినాయకస్వామి, శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి, చండికేశ్వరుడు, భక్తకన్నప్ప ముందుకు సాగారు. శ్రీకాళహస్తీశ్వరుడు ఓ తెప్పపై, జ్ఞానాంబిక మరో తెప్పపై ఆశీనులు కాగా అర్చకులు హారతులు సమర్పించి ప్రదక్షిణలు ప్రారంభించారు.మొత్తం 5 ప్రదక్షిణలుగా స్వామి అమ్మవారు పుష్కరిణిలో విహరించారు.తరువాత ఉత్సవర్లను కోనేరు నుంచి వెలుపలకు తీసుకొచ్చి నైవేద్యం సమర్పించారు. అక్కడినుంచి పురవీధుల్లో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు.





బస్సుల్లేక జనం పాట్లు

సిద్ధం సభకు 155బస్సుల తరలింపుతో ప్రయాణికుల పడిగాపులు


తిరుపతి బస్టాండులో బస్సులకోసం నిరీక్షణ


బస్సుల కొరతతో ప్రయాణికుల ఇబ్బందులు

తిరుపతి అర్బన్, మార్చి 9: సిద్ధం పేరిట నిర్వహిస్తున్న వైసీపీ ప్రచారసభలు ఆర్టీసీ ప్రయాణికులతో పాటు విద్యా సంస్థల యాజమాన్యాలకు తలనొప్పిగా మారిపోతు న్నాయి. ఎక్కడ సభ జరిగినా చుట్టుపక్కల జిల్లాల ఆర్టీసీ బస్సులను,విద్యాసంస్థల బస్సులను జనాన్ని తరలించడానికి తీసుకువెళుతుండడంతో ఆ రెండుమూడు రోజులు ప్రయాణికుల,విద్యార్థుల అవస్థలు అన్నీఇన్నీ కావు. శివరాత్రి సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ఇప్పటికే శైవక్షేత్రాలకు 436బస్సులు కేటాయించిన ఆర్టీసీ అవి తిరిగి డిపోలకు చేరకుండానే బాపట్ల జిల్లా మేదరమెట్లలో ఆదివారం జరిగే సిద్ధం సభకు జనాన్ని తీసుకువెళ్లడానికి అట్నించి అటే పంపించివేయడంతో బస్టాండుల్లో జనం బస్సులకోసం శనివారం నుంచే పడిగాపులు కాశారు. మొత్తం 155బస్సులను ఎంపిక చేయగా వాటిలో ఇప్పటికే 60బస్సులు బాపట్లజిల్లా కోటప్పకొండ కనుమమార్గంలో శివరాత్రి స్పెషల్స్‌గా నడుస్తున్నాయి. ఆదివారం ఉదయం అదే జిల్లాలోనే జరిగే సిద్ధం సభకు వాటిని అక్కడ్నించే పంపించేశారు.కోటప్పకొండకు వెళ్లిన జంట డ్రైవర్లు సిద్ధం సభకు వెళ్లేందుకు అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. మూడు రోజులుగా కొద్దిపాటి విశ్రాంతితో బస్సులు నడుపుతుంటే మరో రోజు విధులు పొడిగించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిసింది. మిగిలిన 95బస్సులు ఆయా డిపోల నుంచి ఆదివారం వేకువజామున బయల్దేరి నెల్లూరుజిల్లాలో వివిధ నియోజకవర్గాల కేంద్రాలకు చేరుకోనున్నాయి. ఈ నేపథ్యంలో తిరుపతిలో శనివారం ఉదయం నుంచే బస్సుల కొరతతో జనం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాయచోటి, పీలేరు, మదనపల్లె ప్రాంతాలకు రాకపోకలు సాగించే బస్సుల కొరతతో ప్రయాణీకులు ప్లాట్‌ఫామ్స్ వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. అడపాదడపా వచ్చిన బస్సుల్లో సీట్లకోసం తోపులాడుకున్నారు. పిల్లలు, మహిళలు, వృద్ధులు పడరాని పాట్లు పడ్డారు.

చిత్తూరు మున్సిపాలిటీ అక్రమాలపై విచారణకు ఆదేశం

చిత్తూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో జరిగిన అవినీతి అక్రమాలపై విచారించి తగు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆ శాఖ డైరెక్టర్‌ను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు మున్సిపాలిటీలోని అవినీతి అక్రమాల గురించి టీడీపీ అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ చిత్తూరు జేసీ శ్రీనివాసులకు గతంలో ఫిర్యాదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా స్థాయిలో స్పందన లేకపోవడంతో ఆయన రాష్ట్ర స్థాయిలో ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లి ఫిర్యాదు చేశారు. దీంతో ప్రిన్సిపల్ సెక్రటరీ విచారణకు ఆదేశించారు. సప్తగిరి ప్రసాద్ ఫిర్యాదులో కొన్ని అంశాలు... 'మున్సిపాలిటీలోని పలురకాల వాహనాలకు డీజల్, పెట్రోల్ పట్టిస్తున్నట్లు దొంగ బిల్లులు పెట్టుకుంటున్నారని.. దీంతో పాటు అధికారులు తమ సొంత వాహనాలకు కూడా డీజల్ పట్టుకుంటున్నారని.. వాహనాల మరమ్మతు పేరుతో నిధులు కాజేస్తున్నారని.. ఇక్కడి రెవెన్యూ విభాగంలో జనన, మరణ ధ్రువపత్రాలకూ లంచం ఇవ్వాల్సిందేనని.. భవనాలను నిర్మించుకునే వారి నుంచి టౌన్‌ప్లానింగ్ అధికారులు బెదిరించి మరీ లంచాలు వసూలు చేస్తున్నారని.. పన్ను బకాయిలు వసూలు చేసేందుకు ఏర్పాటు చేసిన ప్రచార ఆటోలకు ఏకంగా రూ.17.14 లక్షలు డ్రా చేశారని.. మోటర్ల మరమ్మతు పేరుతో పెద్దఎత్తున నిధులు స్వాహా చేశారని.. కమిషనర్ తన బంగ్లాలో స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికంటూ పెద్దఎత్తున నిధులను దుర్వినియోగం చేశారని.. వచ్చే లంచాల్లో కమిషనర్, సిబ్బంది వాటాలు వేసుకుని పంచుకుంటున్నారని..' టీడీపీ నేత చేసిన ఫిర్యాదులో ఉన్నాయి. వీటన్నింటిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన కోరడంతో ప్రిన్సిపల్ సెక్రటరీ విచారణకు ఆదేశించారు.

వైభవంగా సంగమేశ్వరుడి రథోత్సవం


పీటీఎంలో సంగమేశ్వర స్వామి రథాన్ని లాగుతున్న భక్తులు


మదనపల్లెలో అలంకరణలో యోగభోగేశ్వరుడు


నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో అన్నదానం చేస్తున్న కురబలు

పెద్దతిప్పసముద్రం మార్చి 9 : మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా టి.సదుం పంచాయతీ చెన్నరాయునిపల్లె పాపాఘ్ని నది ఒడ్డున వెల సిన ప్రసన్న పార్వతీ సమేత సంగమేశ్వరస్వామి వారి రథోత్సవం కన్నుల పండువగా వైభవంగా నిర్వహించారు. ఆలయంలో నిర్వహిం చే ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజైన శనివారం ఉదయం ఆల యంలో స్వామి వారికి పంచామృతాభిషేకంతో పాటు స్వామి వారికి విశేషపూజలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం ఆలయ ధర్మకర్త పీవీ రామాంజనేయరెడ్డి, చెన్నరాయునిపల్లెకు చెందిన మొలక లచెరువు మాజీ మార్కెట్ చైర్మన్ శ్రీనాథ్‌రెడ్డి, పి.రామిరెడ్డి, బొమ్మే వెం కట్రమణప్పల ఆధ్వర్యంలో ప్రసన్న పార్వతీ సమేత సంగమేశ్వర స్వామి వారి ఉత్సవ మూర్తులను రథంలో కొలువు తీర్చి వేదపండి తుల కైంకర్యములతో శివనామస్మరణలతో మంగళవాయిద్యాలు, చెక్క భజనలు, కోలాటలు, బళ్లారి డ్రమ్స్‌లతో స్వామి వారి రథాన్ని పురవీ ధుల్లో ఊరేగించారు. రథోత్సవాన్ని తిలకించేందుకు కర్ణాటక, ఆంధ్రప్ర దేశ్ రాష్ట్రాల నుచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి రథోత్సవాన్ని తిలకించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమా న్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్, మనోజ్ జయంత్‌రెడ్డి, తంబళ్లపల్లె పోల్ మేనేజ్మెం ట్ కుడుం శ్రీనివాసులు, మాజీ సింగల్ విండో చైర్మన్ సంపతికోట కిట్టన్న, మండల తెలుగు యువత అధ్యక్షుడు శివ, రాజంపేట బీసీ సెల్ కార్యదర్శి సూరి, భాస్కర్‌యాదవ్, మాజీ జడ్పీటీసీ ఈశ్వరప్ప, టీడీపీ మండల అధ్యక్షుడు ఆనంద్‌రెడ్డి, ఈవీ రమణ, బస్సు బయ్యా రెడ్డి, సర్పంచ్ శారద, ఉపసర్పంచ్ మధుకర్‌రెడ్డి, సీనియర్ బీజేపీ నాయకుడు చల్లపల్లె నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్దుండాల మల్లేశ్వరుడి దర్శనానికి పోటెత్తిన జనం

పీలేరు, మార్చి 9: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం మద్దుండాల మల్లేశ్వరుడి జాతరకు పీలేరుతోపాటు పరిసర ప్రాంతాల ప్రజలు పోటెత్తారు. భక్తులతో అడవిపల్లె అటవీ ప్రాంతం కిటకిటలా డింది. జాతర సందర్భంగా స్వామి వారికి శనివారం వేకువజామునే ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సంతాన లేమితో బాధపడుతున్న మహిళలు శుక్రవారం రాత్రి ఆలయం వద్దనే జాగారణ చేసి ఆలయ సమీపంలోని ఝరిలో పవిత్ర స్నానమాచరించి శనివారం ఉదయం స్వామి ఎదుట వరపడ్డారు. అడవిపల్లె, తలపుల, రేగళ్లు, కేవీపల్లె మండలంలోని పలు ప్రాంతాల నుంచి తరలి వచ్చిన దేవరెద్దులు, గొడుగులు జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జాతర కోసం వచ్చిన వారి కోసం తలపుల, పీలేరు ఆర్యవైశ్య సంఘంతోపాటు వివిధ సంఘాలు, ప్రైవేటు వ్యక్తులు ఆలయ పరిసరాల్లో పెద్దఎత్తున అన్న దానం చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఉత్సవ కమిటీ ఆలయం వద్ద ప్రత్యేక క్యూలైన్లు నిర్మించి స్వామి వారి దర్శనం త్వరితగతిన జరిగేలా చూశారు. పీలేరు అర్బన్ సీఐ మోహన్ రెడ్డి, ఎస్ఐ నరసింహుడు ఆధ్వర్యంలో ఆలయం వద్ద బందోబస్తు ఏర్పాటు చేసి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అటవీ ప్రాంతం కావడంతో ఎటువంటి అగ్నిప్రమాదాలు జరగకుండా పీలేరు అటవీ శాఖ రేంజర్ రామ్లా నాయక్ నేతృత్వంలో సిబ్బంది పహరా కాశారు. తలపుల పీహెచ్‌సీ సిబ్బంది ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. మరోవైపు పీలేరు పట్టణంలో విశాలాక్షి, కాశీ విశ్వేశ్వరుడు పీలేరు ప్రధాన వీధుల్లో విహరించారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామి వారికి అత్యంత ప్రీతిపాత్రమైన త్రిశూలానికి మదనపల్లె మార్గంలోని చెన్నకే శవ స్వామి ఆలయం వద్ద శాస్త్రోక్తంగా పవిత్ర స్నానం నిర్వహిం చారు. అనంతరం ఆలయంలో స్వామి, అమ్మవారికి డోలోత్సవం నిర్వ హించారు. శివరాత్రి సందర్భంగా కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో ప్రముఖ సంగీత విద్వాంసుడు విజయ్ కుమార్ నిర్వహించిన సంగీత కచేరి ఆహుతులను ఆకట్టుకుంది. శివరామపురంలోని భ్రమరాంబ మల్లిఖార్జునుడికి శనివారం ఉదయం ఝరిస్నానం, షోడపచార పూజలు నిర్వహించారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో ఆయా ఆలయాల ఉత్సవ కమిటీ సభ్యులు వారణాశి మోహన్ రెడ్డి, సభ్యులు సుధాకర, విజయ్ కుమార్, సుమన్, ఆటో బాషా, చాన్‌బాషా, ఉద్యా ఫణీంద్రశర్మ, మయూర్‌నాథ శర్మ, వెంకటరమణ నాయునివారు, మల్లిఖార్జున రెడ్డి, సందీప్ రెడ్డి, ఆంజనేయులు, అర్చకులు విరూపాక్షం కుమారస్వామి, సూత్రం కిరణ్ కుమార్, గౌతమ్, పవన్, వినయ్, విరూపాక్షం శ్రీనివాస శాస్త్రి, విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మహాశివరాత్రి ఉత్సవాలు

మదనపల్లె అర్బన్, మార్చి 9: పట్టణంలో మహాశివరాత్రి ఉత్సవాలు శనివారంతో అత్యంత వైభవంగా ముగిసాయి. చిప్పిలి మడికయ్యల శివాలయంలో యోగభోగేశ్వరుడికి, వల్లిదేవసేనా సమేత సుబ్రహ్మణ్యం స్వామి వార్లకు విశేష అలంకరణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజలో టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త మార్పూరి సుధా కర్‌నాయుడు,చైన్నైలోని ప్రశాంత్ మల్టీ స్పెషాలిటీ హాస్పిల్ నిర్వహ కులు డాక్టర్లు ఎం.యశస్విరాజ్, సాయిసంహిత, విజయశ్రీ, డాక్టర్ మార్పూరిశ్రీదేవి, ఎం.మురళీధర్ పాల్గొన్నారు. దేవళంవీధిలోని సోమేశ్వ రస్వామి ఆలయంలో స్వామివారికి శయనోత్సం నిర్వహించారు. నీరు గట్టువారిపల్లెలోని నీలకంఠేశ్వరుడికి రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ దండురామాంజులు, వెంకటనాగులమ్మ, వెంటరమణ, దండు ఆనంద్, ఆలయధర్మకర్త గుడి రామాంజులు, శివశంకర్, ఆధ్వర్యంలో అన్నదాన ం నిర్వహించారు. అంతకముందే ఆలయంలోని నీలకంఠేశ్వరుడికి ఆలయ అర్చకులు శయనోత్సం నిర్వహించారు. పట్టణంలోని ఆర్యవైశ్య హాస్టల్ శుక్రవారం రాత్రి శివపార్వతుల కల్యాణం కమనీయంగా జరి గింది. ఈ కార్యక్రమాన్ని మదనపల్లె ఆర్యవైశ్య సంఘంపట్టణ అధ్యక్షు డు పూనగంటి ఓంప్రకాష్, కమిటీ సభ్యులు, వాసవీక్లబ్ సభ్యులు శ్రీనాథ్, పి, అమరపాథ్, లక్ష్మీదీపక్, వీవీకృష్ణారావు, వాసవీ మహిళ వనితాక్లబ్ సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో స్వామివారి కల్యాణంలో పాల్గొని భక్తులకు అన్న సంతర్పణ చేశారు. కనకాదస్ నగర్ కాలనీ సమీపంలోని సిద్ధలింగేశ్వరస్వామికి శనివారం ఉదయం పార్వతీ, పరమేశ్వర కల్యాణం నిర్వహించారు.

వాల్మీకిపురంలో: మహాశివరాత్రి సందర్భంగా వీరన్నకొండపై వెలసిన వీరభద్రేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొం ది. ఈసందర్భంగా అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ధర్మపథం సమూహాలయంలో లింగోద్భవ మహాశివుడికి, కోనేటివీధిలో వెలసిన శివాలయంలో కామేశ్వరస్వామికి అభిషేకాలు, హోమాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. వేలాది భక్తజనం నడుమ ఆలయాలలో శివ పార్వతుల కల్యాణ మహోత్సవ వేడుకలు నిర్వహించి తీర్థప్రసాద, అన్న వితరణ చేపట్టారు. కార్యక్రమంలో అర్చకులు సాలిగ్రామ శ్రీని వాసాచార్యులు, ఆలయాల ధర్మకర్తలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేలమల్లేశ్వరస్వామి ఆలయంలో పగటి తిరుణాళ్ల

నిమ్మనపల్లి, మార్చి 9: మండలంలోని తవళం పంచాయతి అటవీ ప్రాతం బాహుదా ఉపనది కుమారస్వామి పశ్చిమ భాగాన వెలసిన నేలమల్లేశ్వరస్వామి ఆలయంలో శనివారం పగటి తిరుణాళ్లకు అధిక సంఖ్యంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకొన్నారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తుల కొరకు సర్పంచ్ రెడ్డెప్ప, దాత రెడ్డెప్పరెడ్డిలు అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే భక్తుల సౌకర్యార్థం గుడి వద్దకు ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు.

వైభవంగా వీరభద్రస్వామి తిరుణాల

ములకలచెరువు, మార్చి 9: మండలంలోని కోనేటివారిపల్లె పంచా యతీ బత్తినివారిపల్లెలో శనివారం వీరభద్రస్వామి తిరుణాల ఉత్సవం వైభవంగా జరిగింది. ప్రతి ఏడాది శివరాత్రి పండగ మరుసటి రోజు వీరభద్రస్వామి తిరుణాల ఉత్సవాలు జరగడం ఆనవాయితీగా వస్తోం ది. ఈ సందర్భంగా స్వామి వారి ప్రతికగా భావించే గొడుగును పూల తో ముస్తాబించి గ్రామంలో ఘనంగా ఊరేగించారు.


పీలేరు వీధుల్లో విహరిస్తున్న కాశీ విశాలాక్షి, కాశీ విశ్వేశ్వరుడు


పీలేరు మద్దుండాల మల్లేశ్వరుడి జాతరకు పోటెత్తిన జనం


వాల్మీకిపురం ధర్మపథంలో లింగోద్భవ మహాశివుడికి ప్రత్యేక పూజలు

కమనీయం.. శివపార్వతుల కల్యాణం


యోగభోగేశ్వరాయలయంలో వైభవంగా శివపార్వతుల కల్యాణోత్సవం

మదనపల్లె టౌన్, మార్చి 9: శివరాత్రి పురస్కరించుకుని మదనపల్లె శివారులోని యోగ భోగేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి స్వామి అమ్మ వార్ల ఉత్సవమూర్తులకు వైభ వంగా కల్యాణోత్సవం నిర్వహిం చారు. సీనియర్ టీడీపీ నేత మార్పూరి సుధాకర్‌నాయుడు కు టుంబీకులు ఉభయదారులు గా ఇంటి నుంచి చీర, సారె ఊరేగిం పుగా శివాలయానికి తీసుకెళ్లారు. మూడు తరాలుగా యోగభోగేశ్వరుడికి శివరాత్రి పండుగ సందర్భంగా కల్యాణోత్సవానికి మార్పూరి కుటుంబీకులే ఉభయదారులుగా వ్యవ హరిస్తున్నారు. ఈ క్రమంలో సుధాకర్‌నాయుడు మనవడు డాక్టర్ ప్రశాంత్ కృష్ణ, సాయిసంహిత దంపతులు కల్యాణోత్సవంలో కూర్చొని ఉత్సవతంతు నిర్వహించారు. మండలంలోని వేంపల్లె పంచాయతీ మల్లయ్యకొండలో శనివారం శివజాతర నిర్వహిం చారు. రాత్రంతా జాగారం చేసి ఉపవాసం ఉన్న భక్తులు మల్లయ్యకొండపై ఏకశిల ఆలయంలోని సర్వేశ్వరుడిని దర్శించుకున్నారు. కురవంక సర్పంచ్ చిప్పిలి చలపతి భక్తులకు అన్నదానం చేశారు.

ఉపవాస భక్తులకు అన్నదానం


భక్తులకు అన్నదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె మండలం రామాచార్లప ల్లె శివాలయం వద్ద జాగారం, ఉప వాసం ఉన్న భక్తుల కు శనివారం అన్నదానం నిర్వహించారు. స్థానికు డు యుగంధర్ ఆధ్వర్యంలో నిర్వ హించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మదనపల్లె టీడీ పీ నేత, మాజీ ఎమ్మెల్యే షాజహాన్ బాషా భక్తులకు అన్నదానం చేశారు. అలాగే పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేష్, టీడీపీ నాయకులు విద్యాసాగర్, నవీన్‌చౌదరి, నాదెళ్ల శివన్న, షంషీర్, డిష్ చలపతి, కత్తి హరి, పూల మోహన, దేవేంద్ర, సంగం హరి పాల్గొన్నారు.


పీటీఎంలో ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి వారి కల్యాణం

పెద్దతిప్పసముద్రంలో: మండల కేంద్రమైన పీటీఎంలో వెలసిన ప్రస న్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం శివ పార్వతుల కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. పీటీ ఎంకు చెందిన ఆధ్యాత్మిక వేత్త అయిన సనగరం పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారిని సుందరంగా అలంకరించారు సాయంత్రం ఆల యంలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన వేదపండితులు పణితేజస్వామి, కన్నాస్వామిలచే శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ఈ కల్యాణ మహోత్స వాన్ని తిలకించేందుకు పీటీఎంతో పాటు సమీప గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసా దాలు, అన్నదానం నిర్వహించారు.


కలికిరి సోమేశ్వరాలయంలో శివపార్వతుల కల్యాణోత్సవ దృశ్యం

కలికిరిలో: కలికిరిలోని పురాత న సోమేశ్వరస్వా మి ఆలయంలో శుక్రవారం రాత్రి శివపార్వతుల కల్యా ణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పుల్లారెడ్డి, పురోహి తులు రామచంద్ర శాస్త్రి, శివకుమార్ శాస్త్రి తదితరు లు కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. గుట్టపాలెం పం చాయతీలోని ప్రసిద్ధమైన పూల కొండలో వెలసిన మల్లేశ్వరస్వామి వారికి మహాశివరాత్రి రెండవ రోజు శనివారం శివపా ర్వతుల కల్యాణోత్సవాన్ని కమనీయంగా నిర్వహించారు. మేడికుర్తి సమీపంలో బాహుదా నది ఒడ్డున కొలువైన అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలం కరించి భక్తుల దర్శనం కల్పించారు. బాహుదా నదిలో జరి స్నానాలకు ఏర్పాట్లు చేశారు. నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదానానికి వేలాదిగా భక్తులు హాజరయ్యారు.

స్వర్ణకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ అప్పినపల్లె భాస్కరాచారి



మదనపల్లె అర్బన్, మార్చి 9: ఏపీలో సీఎం జగన్ ప్రతిపక్ష నాయ కుడి హోదాలో స్వర్ణకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని రాష్ట్ర స్వర్ణకారుల సంక్షేమ సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ అప్పినపల్లె భాస్కరాచారి డిమాండ్ చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ స్వర్ణకారులకే తాళి బొట్లు తయారు చేసుకునే హక్కు కల్పించాలని డిమాండ్ చేశా రు. స్వర్ణకారులపై పోలీసులు వేధింపుల విముక్తికై 272 జీవోలో మార్పులు చేయాలని కోరారు. స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, 50 ఏళ్ల పూర్తిఅయిన వారికి పింఛన్ మంజూరు చేయాలని తెలిపారు. సీఎం జగన్ ఇచ్చిన నాలుగు హామీలు 58 నెలలైనా అమలుకు నోచుకోలేదన్నారు. రాష్ట్రంలో కార్పొరేట్ వ్యవస్థ పెరిగిపోయిస్వర్ణాభరణాలు తయారు చేసే స్వర్ణకారులకు పనిలేకకుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశా రు. ప్రస్తుతం కలియుగ దైవం టీటీడీ మంగళసూత్రాలు తయారు పేరుతో వ్యాపారం ప్రారంభించడంతో స్వర్ణకారులకు కొద్దిపాటి పని కూడా దొరకడంలేదన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఈ వ్యాపారం అమలును ఉపసంహరించుకోవాలని కోరారు. టీటీడీ చైర్మన్ తీర్మాణం చేసి నాలుగు కోట్లకి మంగళసూత్రాలు ఆర్డర్ కూడా ఇవ్వడం జరిగిందన్నారు. దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా గ్రీవెన్స్ డేలో ఫిర్యాదు చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం సమాలోచించి మాకు న్యాయం చేయాలని కోరారు.

'టీడీపీ అభ్యర్థిగా శంకర్‌యాదవ్‌ను ప్రకటించాలి'

తంబళ్లపల్లె, మార్చి 9: తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ-జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్‌ను ప్రకటించాలని టీడీపీ నాయకులు, శంకర్ అనుచరులు అధిష్టానాన్ని కోరారు. శంకర్‌యాదవ్‌కు న్యాయం చేయాలని కోరుతూ శనివారం తంబళ్లపల్లె క్రాస్‌లో టీడీపీ జెండాలు చేతబట్టి శాంతియుతంగా నిరసన తెలి పారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ..గత నాలుగున్నరేళ్లుగా తంబళ్లపల్లెలో టీడీపీని, కార్యకర్తలను కాపాడుకుంటూ వచ్చిన శంకర్‌యాదవ్‌ను కాద ని...జయచంద్రారెడ్డికి టికెట్ కేటాయించడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో పెద్దమం డ్యం మండలాధ్యక్షుడు వెంకట్రమణ, క్లస్టర్ ఇన్‌చార్జ్ బేరిశీన, తంబళ్లపల్లె మండల ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తినాయుడు, రాజంపేట పార్లమెంట్ తెలుగుయు వత ఉపా ధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, తెలుగు యువత నాయకులు నరసింహులు, గంగరాజు, రాజంపే ట పార్లమెంట్ రైతు ఉపాధ్యక్షుడు వెంకటరెడ్డి, యూనిట్ ఇన్‌చార్జ్ నారాయణ, వీరాంజ నేయులు, మాజీ జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లెను జిల్లా కేంద్రంగా ప్రకటించాలి

మదనపల్లె అర్బన్, మార్చి 9: మదనపల్లెను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని, జిల్లాకు శ్రీకృష్ణదేవరాయులు పేరును పెట్టాలని రాయలసీమ బలిజసేవా సమితి అధ్యక్షుడు బ్యాంక్ రమణ డిమాండ్ చేశారు. శనివారం మదనపల్లె రాయలసీమ బలిజసేవా సమి తి సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ రాష్ట్రంలో దాదాపుగా 2 కోట్లు ప్రజానికం కాపు, బలిజ సామాజిక వర్గం ఉన్నారన్నారు. రాయలసీమలో శ్రీకృష్ణదేవరాయులు వారసులుగా రాయలసీమ బలిజసేవా సమితి ఏర్పాటు చేసి అభివృద్ధి, సేవా కార్యక్రమాలు నిర్వహించాలనే ధృఢ సంకల్పంతో ఉన్నా మని తెలిపారు. కార్యక్రమంలో మదనపల్లె సీనియర్ సిటిజన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునిగోటి గోపాల్ శర్మ, రామమోహన్, రమణ, గిరీశం, సభ్యులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్


కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కురబలకోట, మార్చి 9: కర్ణాటక మ ద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సద్గురు, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపా రు. శనివారం మండలంలోని ముదివే డు పోలీస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలే కరుల సమావేశంలో సీఐ మాట్లాడు తూ మదనపల్లె పట్టణం చీకిలబైలుకు చెందిన సందీప్ మండలంలోని దొమ్మన్న బావి వద్ద మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి ఓహోటల్‌లో 170 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని సందీప్‌ను అదులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. కాగా హోటల్ యజమాని పరారయ్యాడన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు రూ.2.80లక్షలు స్వాధీనం


నిందితుడిని అరెస్టు చూపుతున్న డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, సీఐ ఎన్.శేఖర్

మదనపల్లె, మార్చి 9: మదనపల్లె మండలం తట్టివారిపల్లె పంచా యతీ పుంగనూరువాండ్లపల్లెలో ఉండే రిటైర్డ్ ప్రొఫెసర్ కె.వెంకటరెడ్డి ఇంట్లో చోరీకి పాల్పడ్డ నిందితుడిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ ప్రసాద్ రెడ్డి, తాలూకా సీఐ ఎన్.శేఖర్‌లు తెలిపారు. స్థానిక తాలూకా పోలీస్ స్టేషన్‌లో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావే శంలో కేసు వివరాలను వెల్లడించారు. పుంగనూరు మండలం అడవి నాథునికుంటకు చెందిన ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి..వెంకటరెడ్డి ఇంట్లో కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో నమ్మకంగా ఉంటున్న చంద్రశే ఖర్‌రెడ్డి..ఆ ఇంటి తాళం చెవిని దొంగలించి గతేడాది జూన్ 5వతేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో రూ.2.40లక్షలు దొంగలించాడు. అలాగే వెంకటరెడ్డి కుటుంబసభ్యులు ఇంటిలో లేని సమయంలో గతనెల 24న మరోసారి రూ.40వేలు చోరీ చేశాడు. ఇలా మొత్తం రెండుసార్లు రూ.2.80లక్షలు చోరీ చేసినట్లు బాధితుని ఫిర్యాదు మేరకు తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు. అతన్ని శనివారం అరెస్టు చేసిన పోలీసులు..నిందితుడి నుంచి రూ.2.80లక్షలు స్వాధీనం చేసుకు ని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వివరించారు. ఈ కేసును ఛేదిం చిన పోలీసులు, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

31మంది పేకాట రాయుళ్ల అరెస్టు

మదనపల్లె, మార్చి 9: మదనపల్లె మండలంలోని వివిధ ప్రాంతాల్లో పేకాట ఆడుతున్న 31 మందిని అరెస్టు చేసినట్లు తాలూకా సీఐ ఎస్.శేఖర్ తెలిపారు. ఇందులోభాగంగా మండలంలోని సీటీఎం, పోతబోలు, దుబ్బిగానిపల్లె ఏరియాలలో పేకాట, మట్కా ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడులు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ఇందులో మూడు ప్రాంతాల్లో 31మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.1.59 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు. ఇందులో ఎస్ఐ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట శిబిరాలపై పోలీసుల మెరుపుదాడులు

- రూ. 4.27 లక్షలు స్వాధీనం..
- 36మంది అరెస్టు

బి.కొత్తకోట, మార్చి9: శివరాత్రి ముసుగులో జరుగుతున్న పేకాట శిబరాలపై బి. కొత్తకోట పోలీసులు మెరుపుదాడులు నిర్వహించారు. శక్రవారం రాత్రి మండలంలోని కాండ్లమడుగు గ్రామంలో పాటు, బి కొత్తకోట పట్టణంలోని రెండు వేర్వేరు ప్రాంతాలలో పేకాట జోరుగా సాగుతున్నట్లు సమాచారం రావడంతో సీఐ సూర్యనారాయణ తమ సిబ్బందితో దాడులు నిర్వహంచారు. మూడు స్థావరాలలో మొత్తం 36 మందిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. వారి వద్ద నుంచి రూ.4,27,150 లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు.

నిమ్మనపల్లిలో: మండలంలోని సోమాన పల్లి సమీపంలో పేకాట ఆడుతున్న 8మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.14,110లను స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్ఐ లోకేష్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయ న మాట్లాడుతూ సోమానపల్లి సమీపంలో గత కొంత కాలంగా పేకా ట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో తన సిబ్బందితో దాడులు నిర్వహించి వారిని అరెస్ట్ చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

మైనార్టీల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం


కాంగ్రెస్ మైనార్టీ సదస్సులో మాట్లాడుతున్న మైనార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దాదాగాంధీ

మదనపల్లె అర్బన్, మార్చి 9: రాష్ట్రంలో మైనార్టీల అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమౌతుందని ఆ పార్టీ మైనార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సాహిల్ దాదాగాంధీ పేర్కొన్నారు. శనివారం మదనపల్లె పట్టణంలో ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో నియో జకవర్గ నాయకుడు రెడ్డిసాహెబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కాంగ్రెస్ మైనార్టీ సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సదస్సులో ముఖ్యఅతిథులుగా మైనార్టీరాష్ట్ర ఉపాధ్యక్షుడు నజీర్‌అహ్మద్, డాక్టర్ ఎస్‌కేబాషా, జిల్లా అధ్యక్షుడు షేక్ అల్లా బకాస్, ఉపాధ్యక్షురాలు మీనాకుమారి, జిల్లామైనార్టీ అధ్యక్షుడు మన్సూరీ అలీఖాన్, అరీఫు ల్లా తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా దాదాగాంధీ మాట్లాడుతూ భారతదేశ నిర్మాణంలో కాంగ్రెస్ పాత్ర అయోఘమన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత వారి అప్రజాస్వామిక విధానాలతో ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రాగానే ఇందిరమ్మ అభయహస్తం పథకం ద్వారా మహిళలకు నెలకు రూ.5వేలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు సయ్యద్, పఠాన్‌ముబారక్, అల్లాబక్షు, ఖాదర్‌బాషా, మహబూబ్‌పీర్, మహమ్మద్‌అలీ, మహమ్మద్ రఫీ, ఈశ్వరమ్మ, సయ్యద్, సోను, ఖాసీం, బక్షు, దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడికి పరామర్శ

మదనపల్లె అర్బన్, మార్చి 9: పట్టణం నీరుగట్టువారిపల్లెకు చెందిన డీసీసీ జనరల్ సెక్రటరీ వెంకటరమణను శనివారం డీసీసీ అధ్యక్షుడు అల్లాబక్షు పరామర్శించారు. వెంకటరమణ పెరాలసిస్ స్ట్రోక్‌తో బాధపడుతూ బెడ్‌రెస్ట్‌లో ఉన్న ఆయన స్వగృహానికి విచ్చేసి ఆరోగ్య జాగ్రతలు పాటించాలని సూచించారు. ఏ అవసరం ఉన్నా పార్టీ తరఫున తాము ఉన్నామని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అమీర్, కార్యదర్శి చలపతి, మదనపల్లె రూరల్ అధ్యక్షుడు సురేంద్రరెడ్డి,నిమ్మనపల్లె బీసీసెల్ అధ్యక్షుడు ఆర్‌నాగరాజు పాల్గొన్నారు.

గొంతుకోసుకుని యువకుడి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె టౌన్, మార్చి 9: కుటుంబ కలహాలతో ఓ యువకుడు బ్లేడుతో గొంతు కోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. మదనపల్లె పట్టణం కుమారపురానికి చెందిన బాబి(23) అనే యువకుడు కుటుంబ కలహాలతో ఆగ్రహించి శనివారం ఇంటిలోనే బ్లేడుతో గొంతు కోసుకున్నాడు. తీవ్రంగా రక్తస్రావం కావడంతో గమ నించిన కుటుంబీకులు మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స చేస్తున్నారు. ఈ మేరకు అవుట్‌పోస్టు పోలీసులు వన్ టౌన్ పోలీసులకు సమాచా రం అందించారు.

కేంద్ర బలగాలతో పోలీసు కవాతు

పెనగలూరు, మార్చి 9: మండలంలో శనివారం సాయంత్రం డీఎస్పీ చైతన్య ఆధ్వ ర్యంలో కేంద్ర ఎస్ఎస్‌బీ కేంద్ర బలగాలు మూడు కి.మీ. దూరం కవాతు నిర్వ హించాయి. సింగనమల నుంచి కంబాలకుంట బీసీ కాలనీ, మండల కేంద్రంతో పాటు పెనగలూరు గ్రామాలలో తుపాకులు చేతపట్టి కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రానున్న సాధారణ ఎన్నికల్లో ప్రజలకు రక్ష ణగా పోలీసులు ఉంటారని, ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియో గించుకోవాలని అవగాహన కోసమే ఈ కార్యక్రమం తలపెట్టినట్లు ఆయన తెలి పారు. ఈ కార్యక్రమంలో రాజంపేట రూరల్ సీఐ మంజునాథరెడ్డి, టౌన్ సీఐ మద్దెయ్య ఆచారి, పెనగలూరు ఎస్ఐ సుబాష్ చంద్రబోస్ పాల్గొన్నారు.

పోలీస్ నిబంధనలు పాటించాలి

గుర్రంకొండ, మార్చి 9:మండలంలోని అన్ని పార్టీల నాయకులు పోలీసుల నిబంధనలను పాటించాలని ఎస్ఐ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. శనివారం విలేక ర్లతో ఆయన మాట్లాడుతూ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పట్టణంలో పోలీస్ యాక్ట్ అమలులో ఉందన్నారు. కావున సమావేశాలు, ర్యాలీ, ధర్నాలు చేయరాదన్నారు. ర్యాలీ, సమావేశాలు నిర్వహించా లంటే పోలీసుల అనుమతులు తప్పని సరిగా తీసుకోవాలన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

హుండీ ఆదాయం రూ.9.96 లక్షలు

సిద్దవటం, మార్చి 9: మండలంలోని వంతాటిపల్లె పంచాయతీ నిత్యపూజస్వామి దేవస్థానం హుండీ లెక్కింపు కార్యక్రమం ఉత్సవాల అధికారి రాంప్రసా ద్‌రెడ్డి, కార్యనిర్వహణ అధికారి మోహన్‌రెడ్డి, చైర్మ న్ కొండారెడ్డి ఆధ్వర్యంలో శనివారం జరిగింది. ఈ హుండీ లెక్కింపులో రూ.9,96,750 వచ్చినట్లు ఈవో మోహన్‌రెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

భారీగా తరలుతున్న చెరుకు లోడ్లు



రామాపురం, మార్చి 9: లక్కిరెడ్డిపల్లె అనంతపురం గంగమ్మ జాతర ఈ నెల 11, 12 తేదీల్లో జరగ నున్న సందర్భంగా చెరుకు లోడ్లతో వాహనాలు భారీగా జాతరకు తరలి వెళ్తున్నాయి. కడప జిల్లా మైదుకూరు, ఖాజీపేట, చెన్నూరు తదితర ప్రాంతాల నుంచి ట్రాక్టర్ల ద్వారా జాతరకు రెండు రోజులు ముందుగానే తీసుకెళ్తున్నారు. చెరుకులను కట్ట రూ.200 చొప్పున రామాపురం, గువ్వలచెరువు తదితర గ్రామాల్లో విక్రయిస్తున్నారు.

వైభవంగా వీరభద్రుని కల్యాణం

చిట్వేలి, మార్చి 9: పాత చిట్వేలిలో వెలసియున్న భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో రెండ వ రోజు శనివారం ఆలయంలో భద్రకాళి వీరభద్రు నికి కల్యాణాన్ని అత్యంత కన్నుల పండువగా నిర్వ హించారు. అనంతరం భక్తులకు పసుపు, కుంకుమ, గాజులు, పసుపు దారం భక్తులకు అందించారు. వేలాది మందికి గొప్ప అన్నదాన కార్యక్రమం నిర్వ హించి తీర్థప్రసాదాలు అందించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలను నిర్వ హించారు.